ఎర్రపెట్టె?

మల్లాది వెంకట కృష్ణమూర్తి

రామనాథ్ బ్రహ్మచారి. ముప్పై నిండుతున్నాయి. దృఢంగా, ఆరోగ్యంగా వుంటాడు. తెలివయిన వాడని తెలిసిపోతుంది అతని మొహం వంక కొంచెం పరిశీలనగా ఎవరయినా చూస్తే. కొద్దిగా నలుపయినా అందమైన వాడికిందే లెక్కలోకి వస్తాడు.

సైకిల్‌కి స్టాండ్, తాళం వేసి, తన పోర్షన్ తలుపుకున్న తాళం తీస్తూ పక్క పోర్షన్ తలుపుకు వేలాడుతున్న తాళం వంక చూసాడు. ప్రక్క పోర్షన్ వాళ్లు వూరికెళ్ళారన్న సంగతి గుర్తుకు వచ్చింది.

'చన్నీళ్ళతో స్నానం చేసి, ఓసారి తన బెడ్‌రూం వంక చూసాడు. సరిత రావడానికి ఇంకా ముప్పావు గంట పైనే

అవుతుంది. ఈ లోపల చాలా చెయ్యాలి ఆ గదికి. చకచకా గదినంతా సర్దటం ప్రారంభించాడు.

సరిగ్గా ఏడూ నలభై అయిదుకి వచ్చింది సరిత. రామనాథ్ బెడ్ రూం వంక చూసింది మెచ్చుకోలుగా. గది నీట్ గా వుంది. చిన్న స్టూల్ మీద వున్న అగరుబత్తి స్టాండ్ లో పదిదాకా కాలుతున్నాయి అగరు బత్తులు సువాసనతో కూడిన పొగవందిస్తూ.

కిటికీ తలుపులన్నీ వేసివున్నాయి పొగ బయటికిపోకుండా, లోపల ఏం జరుగుతోంది కనబడకుండా. పైన జి. ఇ. సి. సీలింగ్ ఫేన్ తిరుగుతోంది. తిరుగుతున్న ఫేన్ కి సరిగ్గా కిందగా మంచం, మంచంమీద తెల్లటి దుప్పటి పరిచిన పరుపు, పరుపునిండా పువ్వులు ఎర్రగా, తెల్లగా.

"ఎక్కడికి వెళ్ళాడు నీ మొగుడు? ఏ వూరు?" అడిగాడు రామనాథ్ బెడ్ రూం తలుపు మూస్తూ.

"నువు ప్రశ్న అడిగిన పద్ధతి నాకు నచ్చలేదు" అన్నది సరిత కొద్దిగా కోపంగా.

"సారీ, మీ ఆయన ఏ వూరు వెళ్ళారు?" అడిగాడు రామనాథ్.

"తాండూరు."

"ఆఫీస్ పనిమీదా?"

"అవును."

"మీ ఆయన పనిచేసే ఆఫీస్ వాళ్ళు మంచివాళ్ళు కదూ?"

చిన్నగా నవ్వింది సరిత.

"నువు బావుంటావు సరితా," అన్నాడు రామనాథ్ సరిత కళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూస్తూ.

"చాలాసార్లు చెప్పావ్ ఇదివరకు" అన్నది సరిత సిగ్గుగా తలవంచుకుని.

"నేను ఎన్నిసార్లు చెప్పినా నిజమే చెప్తాను. నీకు

సుదర్శన్‌తో పెళ్ళికాకుండా వుండివుంటే, తప్పకుండా నిన్ను నాదాన్ని చేసుకునే వాణ్ణి. ఈ పాటికి మనిద్దరికీ పెళ్ళయి పోయేది తెలుసా."

సరిత మౌనంగా వుండిపోయింది.

రామనాథ్, సరిత దగ్గరకి నడిచాడు. రెండు చేతులూ సరిత నడుం చుట్టూ వేసి, బిగించి, తన మీదకి లాక్కున్నాడు బలంగా. సరిత అభ్యంతరం చెప్పలేదు. రామనాథ్ మీదికి వరిగిపోయింది.

గాఢంగా చుంబించాడు సరితని రామనాథ్.

గాల్లోకి ఎత్తాడు సరితని చటుక్కున. గాల్లోకి ఎత్తి పట్టుకునే మంచంవైపు నడిచాడు సరితతో.

అరగంట దాకా ఆ గదిలో గాలి స్తంభించింది. శృంగారం రాజ్యం ఏలింది. ఓ కొత్త లోకం ఏర్పడింది ఆ కాస్సేపు.

అరగంట తర్వాత మాట్లాడాడు రామనాథ్.

"నెలనుంచి విడిగానే వున్నాం."

"అవును."

"పోనీ, సుదర్శన్‌కి విడాకులు ఇచ్చేయరాదు."

"అమ్మో! విడాకులే?"

"అవును. విడాకులు."

"విడాకులిస్తే ఇంకేమన్నా వుందా? పెద్దవాళ్ళకి ఏం సమాధానం చెప్పుకోవాలి?"

"ఏదయినా చెప్పచ్చు."

"ఇచ్చి?"

"మనిద్దరం పెళ్ళి చేసుకుందాం."

"కుదరదు."

"ఇలా ఎంతో కాలం కుదరదనుకుంటాను కూడా."

"కుదరనప్పుడు ఆలోచిద్దాం."

రామనాథ్ సిగరెట్ అందుకుని అంటించి అన్నాడు.

"సీరియస్ గానే అడుగుతున్నాను... ఐ లవ్ యూ సరితా!"

సరిత మౌనంగా వుండిపోయింది. మాట్లాడలేదు. ఇంత వరకు పెళ్ళి గురించి మాట్లాడలేదు రామనాథ్ ఎప్పుడూ. మొదటిసారి ఇది. విడాకుల గురించి తనెప్పుడూ ఆలోచించ లేదు కూడా. ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా వుండి పోయింది.

రామనాథ్ సిగరెట్ తాగుతూ ఆలోచిస్తూండి పోయాడు.

"పెళ్ళి మీదకి గాలి మళ్ళిందా?" నవ్వుతూ అడిగింది సరిత రామనాథ్ భుజంమీద చేతులువేసి.

"అవును. ఇంకెంతకాలం ఈ బ్రహ్మచారి బ్రతుకు."

తలుపు తట్టిన చప్పుడు వినిపించింది.

రామనాథ్ భుజం మీంచి చేతులు తీసి అడిగింది సరిత కొంచెం ఇబ్బందిగా.

"ఎవరో వచ్చారు. ఎవరినయినా రమ్మన్నావా?"

"ఎవరినీ రమ్మనలేదు. రావద్దని మా కొలీగ్స్ ఒకళ్ళిద్దరికి చెప్పి వచ్చాను కూడా."

"ఎవరో చూసి పంపించిరా."

"బహుశ పక్క పోర్షన్‌లో వాళ్లు అయివుంటారు. వూరునించి తిరిగివచ్చి వుంటే కీళ్ళు అడుగుతారు. అంతకంటే ఇంకెవరూ అయివుండరు."

మళ్ళీ తలుపు దబదబ చప్పుడయింది.

"కొంపతీసి ఏ చుట్టమయినా అయితే?" అన్నది సరిత కంగారుగా.

"చుట్టమయితే కష్టమే. బాబాయి వస్తానని ఉత్తరం రాసారు. ఆ గదిలోకి వెళ్ళు," అన్నాడు రామనాథ్ ధైర్యం తెచ్చుకుంటూ.

"మరి నన్ను చూడరూ ఆ గదిలోకి వస్తే?"

"రానివ్వను. నువు త్వరగా వెళ్లు."

సరిత మంచం దిగి బెడ్ రూంలోంచి లోపలికి వెళ్ళింది, వెనక గదిలోకి.

మళ్ళీ తలుపు చప్పుడయింది. ఆగకుండా కొడుతున్నారు ఎవరో.

"వస్తున్నాను" అరిచాడు రామనాథ్ కఫ్‌లింక్స్ పెట్టుకుంటూ.

రామనాథ్, సరిత లోపలికి వెళ్ళగానే తలుపు వేసి బయట గొళ్ళెం పెట్టాడు. అలమార తెరచి తాళం కప్పా, తాళం చెవీ అందుకుని బయట గొళ్ళానికి తాళం వేసి, తాళం చెవి జేబులో వేసుకున్నాడు జాగ్రత్తగా.

తలుపుమీద చిన్నగా తట్టి అన్నాడు నెమ్మదిగా సరితతో.

"భయపడకు. వాళ్ళని పంపించి వస్తాను."

తలుపులు పగిలిపోయేలా బాదుతున్నారు ఎవరో.

"వస్తున్నాను. వస్తున్నాను. ఆగండి ఎవరో," గట్టిగా అరిచాడు రామనాథ్ కాస్త కోపంగా.

అద్దం ముందు నిలబడి గబగబా దువ్వెన అందుకుని చెదరిపోయిన జుట్టుని దువ్వుకున్నాడు చకచకా. ఆ గదిలోంచి ముందు గదిలోకి వచ్చి, ఆ గది తలుపులు దగ్గరగా నొక్కాడు లోపలికి వచ్చే వాళ్లు తన బెడ్ రూంలోని అగరు బత్తుల వాసనని, మంచంమీద పూలని చూడకుండా.

2

"మెలకువ రాలేదు. త్వరగా నిద్ర పట్టింది రోజు" అన్నాడు రామనాథ్ తలుపు తెరుస్తూ.

గుమ్మం అవతల నిలబడివున్న మనిషిని చూడగానే ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లయింది రామనాథ్‌కి. కాళ్ళలోంచి వణుకు పుట్టుకు వచ్చింది.

సరిత భర్త!

సుదర్శన్!!

"మీరా?" అన్నాడు ఆశ్చర్యాన్ని కప్పి పుచ్చుకుంటూ.

"నేనే."

పేంట్ జేబులోంచి చేతులు తీయకుండానే, అలాగ నిలబడి నవ్వుతూ అన్నాడు సుదర్శన్, రామనాథ్ వంక చూస్తూ.

"సారీ. మెలకువ రాలేదు" అవలించాడు రామనాథ్.

"నేను సారీ చెప్పాలి మీకు, ఇప్పుడువచ్చి మిమ్మల్ని డిస్టర్బ చేస్తున్నందుకు."

ఏం మాట్లాడాలో తెలియలేదు రామనాథ్ కి. సుదర్శన్ ఎప్పుడు ఆవేళప్పుడు రాలేదు. అసలు తనింటికి వచ్చింది ఒకటి, రెండుసార్లు మాత్రమే.

"బయటే నిలబెట్టేసారు. నేను లోపలికి రాకూడదా?" అడిగాడు సుదర్శన్.

"అబ్బె. రండి" పొడిగా నవ్వి పక్కకి జరిగాడు రామనాథ్.

"కూర్చోండి" అన్నాడు రామనాథ్ ముందు గదిలోనే వున్న పేము కుర్చీకేసి చూపిస్తూ. అక్కడకక్కడే మాట్లాడి పంపించాలి త్వరగా.

"థాంక్స్" కూర్చున్నాడు సుదర్శన్ కుర్చీలో.

రామనాథ్ ఆలోచిస్తున్నాడు. ఎందుకు వచ్చాడు సుదర్శన్ ఎప్పుడూ రానివాడు? రెండు రోజులు కేంప్ కి వెళ్ళాడని చెప్పిందే సరిత? కేంప్ కి వెళ్లలేదా? వెళ్లి తిరిగి వచ్చేసాడా ఏ కారణం చేతయినా? తమ విషయం తెలిసిపోయిందా లేకపోతే?

ఏదో ఆలోచిస్తున్నట్టుగా కూర్చున్న సుదర్శన్ ని అడిగాడు రామనాథ్, తమ మధ్య నిశ్శబ్దాన్ని భరించలేక,

ఏదైనా మాట్లాడాలని.

"కేంప్ కి వెళ్లలేదా?"

సుదర్శన్, రామనాథ్ వైపు తిరిగి అడిగాడు చటుక్కున.

"నేను కేంప్ కి వెళ్లానని మీకెలా తెలుసు?"

గొంతులో పచ్చి వెలక్కాయ అడ్డుపడి నట్లయింది రామనాథ్ కి. తొందరలో ఆలోచించకుండా పిచ్చి ప్రశ్న వేసాడు.

"ఆఫీస్ కి నాకోసం ఫోన్ చేస్తే చెప్పారా, ఆఫీసులో ఎవరైనా నేను కేంప్ కి వెళ్ళానని?" అడిగాడు సుదర్శన్.

"యస్. పొద్దున పదిన్నరకి ఫోన్ చేసాను. మీరు వూరెళ్లారని చెప్పారు. తాండూరుకని."

"దేనికి ఫోన్ చేసారు?"

"వూరికేనే. మాట్లాడుదామని."

"నేను పొద్దున ఆఫీస్ లోనే వున్నాను. మీరు ఫోన్ చెయ్యలేదు. అబద్ధం ఆడుతున్నారు."

రామనాథ్ గొంతుకలో మరోసారి పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"చెస్ ఆడదామా? ఆడి చాలారోజు లయింది?"

వింతగా చూసాడు రామనాథ్ సుదర్శన్ వంక.

"ఇప్పుడా?"

"అవును."

"సారీ. ఇప్పుడు మూడ్ లో లేను."

గట్టిగా గాలి పీల్చి అడిగాడు సుదర్శన్.

"అగరత్తుల వాసనేనా అది?"

"అవును" చెప్పాడు రామనాథ్.

"ప్రతీ రాత్రి మీరు అగరత్తులు వెలిగిస్తారా?"

"ఈ మధ్య అలవాటయింది."

సుదర్శన్ లేచి నిల్చున్నాడు. వెళ్ళిపోతాడేమో ననుకున్నాడు రామనాథ్. వీధి గుమ్మంవైపు వెళ్ళలేదు సుదర్శన్.

పడక గదికీ, ముందు గదికీ మధ్యనున్న తలుపు దగ్గరికి నడిచి తలుపుతోసి, పడక గదిలోకి అడుగు పెట్టాడు.

తను ముందు జాగ్రత్త పడటం మంచిదయింది అనుకున్నాడు రామనాథ్. లేకపోతే సరిత, సుదర్శన్ కళ్ళబడేదే.

సుదర్శన్ ఆ పడక గదిలోని ప్రతీ వస్తువుకంకా పరీక్షగా చూసాడు. వెలుగుతున్న అగరత్తుల వంక, గదినిండా అలుముకున్న పొగవంక గది మధ్యలో తిరుగుతున్న ఫేన్ కింద వున్న మంచంవంకా, మంచం మీద నలిగి పడివున్న మల్లె, గులాబీల వంక, పక్క స్టూల్ మీద వున్న స్వీట్స్ వంక.

మంచం దగ్గరికి నడిచి మంచంమీద కూర్చుని అన్నాడు, తనలో తను అనుకుంటున్నట్టుగా, సుదర్శన్.

"పక్క బాగా నలిగిపోయింది అప్పుడే."

తలుపుకి అవతలివైపు మూడో గదిలోవున్న సరితకి వినబడుతున్నాయి ఇద్దరి మాటలు. గుండె విపరీతంగా కొట్టుకుంటోంది అమిత వేగంగా. వళ్ళంతా చెమటలు పట్టేసింది. గుండెనిండా భయం కరుడు కట్టింది. భర్తగొంతు గుర్తుపట్టింది.

పక్కమీద కూర్చున్నాడు సుదర్శన్.

"ఆ గదిలో ఏముంది?" అడిగాడు సుదర్శన్ తాళం వేయబడిన గదివంక కనుబొమలు ఎత్తి చూపిస్తూ.

"సామాను" కోపంగా అన్నాడు.

"ఇంకా?"

"అంటే?"

"సామానుతో పాటు ఎవరున్నారు ఇంకా?"

"మిస్టర్ సుదర్శన్" అన్నాడు రామనాథ్ కోపం అణుచుకుంటూ.

"బహుశ ఆడవాళ్ళయి వుండచ్చు."

పిడికిలి బిగించి అన్నాడు రామనాథ్.

"మైండ్ యువర్ మేనర్స్ ఎండ్ చెక్ యువర్ టంగ్."

"అదే నేనూ చెప్దామనుకునేది. సరిగ్గా నా మనసులోని వుద్దేశాన్ని గ్రహించేసారు చూసారా?"

నవ్వాడు సుదర్శన్.

గోడకున్న మేకుకు వ్రేలాడుతున్న ఫ్లాస్క్ వంక చూసి అడిగాడు సుదర్శన్, రామనాథ్‌ని.

"కాఫీ వుందా దాంట్లో?"

తలూపాడు రామనాథ్.

రామనాథ్ ఫ్లాస్క్ అందుకుని, రెండు కప్పుల్లోకి వంచాడు కాఫీని, కప్పులని అలమారులోంచి తీసి.

"త్రాగండి" అన్నాడు.

కప్పు అందుకుని ఓ గుక్క త్రాగి అన్నాడు సుదర్శన్.

"థాంక్స్. ఆ గది తాళం చెవికూడా ఇస్తారా?"

మౌనంగా తన చేతిలోకి కప్పునందుకుని ఓ గుటక వేసాడు రామనాథ్, సుదర్శన్‌కి సమాధానం ఇవ్వకుండా.

"ఆ గది తాళం చెవి ఇవ్వు?" కటువుగా అన్నాడు సుదర్శన్.

సుదర్శన్ ఏకవచనంలోకి దిగడం గమనించి అన్నాడు రామనాథ్.

"చూడు మిస్టర్ సుదర్శన్. ఆ గదిలో మీరూహించినట్లుగానే ఓ అమ్మాయి వుంది. కాని మీకు కనపడదు. లోపల వున్నది ఎవరో మీకు తెలియటం అనవసరం."

"లోపల నా భార్య వుంది కనక నా కవసరమే."

"మిమ్మల్ని మీరు ఇన్సల్ట్ చేసుకున్నారు అలా భావించి."

"సరిగ్గా ఒక్క నిమిషం టైం ఇస్తున్నా. తలుపును తెరవకపోతే పదిమందిని పిలిచి గొడవ చేస్తాను. ముగ్గురికీ మర్యాదగా వుండాలంటే ఈ సంగతి మన ముగ్గురి మధ్యే

తెల్చుకోవటం మంచిది.''

''ప్లీజ్. మీరు నమ్మాలి, ఆ గదిలో వున్నది మీ భార్య కాదు.ఓ సంసార పక్షపు పిల్ల. మీరు ఆమెని చూడడం మంచిదికాదు.''

పకపకా నవ్వి అన్నాడు సుదర్శన్.

''నేనేం పిచ్చివాణ్ణి కాను. సరిత మీ ఇంట్లోకి రావడం స్పష్టంగా చూసాను నేను. గాలితో కలిసి మాయమవలేదు. ఆ గదిలో నే దాచావని తెలుసు నాకు. దయచేసి టైం వేస్ట్ చేయక.''

సరిత గుండెల్లో రాయి పడ్డట్లయింది. తన భర్త చూసాడు తను రావటం? అంటే తమ రహస్యం ముందరే తెలుసుకుని అది నిర్ధారణ చేసుకోవడానికి వచ్చారన్న మాట! నిలువెల్లా వణికిపోతోంది.

''రామనాథ్ తాళం తీస్తావా, లేకపోతే అందరినీ పిలచి, పోలీస్ రిపోర్ట్ ఇవ్వనా?''

''అందరినీ పిలుస్తే మీ పరువుపోతుంది.''

రామనాథ్ నోరు జారినందుకు తనని తను తిట్టుకున్నాడు.

''క్విక్. తాళం తెరు,'' గర్జించాడు సుదర్శన్.

రామనాథ్ కి అర్థమయింది ఆ గదితాళం తెరవడంతప్ప తనింక ఏమీ చేయలేనని. జేబులోంచి తాళం చెవితీసి, ఇష్టంలేకపోయినా, సరిత వున్న గదిగుమ్మంవైపు కదిలాడు.

ఆ క్షణంలో, చటుక్కున, సుదర్శన్ తను తెచ్చిన చిన్న సీసాని జేబులోంచితీసి, రామనాథ్ కొంచెం తాగి వదిలిన కాఫీకప్పులోకి వంచాడు ఆ సీసాలోని ద్రవాన్ని గబగబా. ఆ సీసామూతమూసి మళ్ళీ జేబులో వేసుకున్నాడు సీసాని.

తలుపు తాళంతీస్తున్న చప్పుడువిని కప్పలా కాలిపోయింది సరిత. ప్రాణాలని వుగ్గబట్టుకుని ఇందాకటినుంచి వింటోంది ఇద్దరి సంభాషణ. రామనాథ్ తెలివిగా ఏదోసర్ది

చెప్పి పంపిస్తాడని నమ్మింది కాని అలా జరగలేదు. తన పాపం బ్రద్దలయింది.

తాళం తెరచి లాగాడు తలుపుని. తెరచుకోలేదు. లోపల గడియ వేసివుంది. రామనాథ్ డ్రాయర్ మీద తాళం కప్పపడేసి గబగబా కాఫీకప్పు అందుకుని త్రాగేసాడు మొత్తం, అప్పటికే గొంతు తడారిపోవడంవల్ల.

"సరితా, తలుపు తీసుకుని బయటికిరా. నీఆట కట్టింది" అన్నాడు సుదర్శన్ క్రోధంగా.

తలుపులు తెరచుకోలేదు.

"సరితా నిన్నే" అరిచాడు సుదర్శన్.

నిశ్శబ్దం.

"సరితా, నన్నింకా రెచ్చగొట్టక. ఓడిపోయావు. తలుపు తెరు."

వణికిపోతోంది సరిత, బయట యముడిలా నిలబడివున్న భర్తని తలుచుకుని. సుదర్శన్ కోపం తెలుసు బాగా. అంగుళంకూడా కదలలేదు. కదలలేకపోయింది.

"సరితా! తలుపులు బద్దలు కొడతాను."

ఒక్క వుదుటున ఎగిరి తన్నాడు సుదర్శన్ బలంగా కాళ్ళతో తలుపుని కోపంగా.

సరిత స్ప్రింగ్‌లా లేచి తలుపు గడియ తీసింది లోపల. తలుపు తెరిచింది.

ఎదురుగా నిలబడివున్నాడు సుదర్శన్. కొంచెందూరంలో వెనకగా రామనాథ్ నిలబడివున్నాడు వాడిపోయిన ముఖంతో

జుట్టుపట్టుకుని లాగి, ఆ చెంపా, ఈ చెంపా వాయిస్తాడనుకుని కళ్ళుమూసుకుని నిలబడింది సరిత.

"బయటకురా," అన్నాడు సుదర్శన్ శాంతంగా.

కళ్లు తెరచి భర్తవంకచూసి భయంభయంగా బయటికి

వచ్చింది సరిత.

జీవితంలో ఇంక ఇంతకంటె, నరకం వుండదనుకుంది సరిత. తప్పుచేయగా, రెడ్ హేండెడ్‌గా పట్టుకుంటే, ఖైదీలాగా, భయంగా, సిగ్గుగా, సగంచచ్చి, తలవంచుకుని ఫలితంకోసం ఎదురుచూడటం. నరకంకన్నా హీనం ఆ క్షణం.

"మీరు మాట్లాడుతూండండి. నేను ఇప్పుడే వస్తాను" బయటికి నడవబోయాడు రామనాథ్.

"కదలకు. మేము మాట్లాడుకుంటూంటే నువ్వు వినకూడని రహస్యాలేమీ లేవు."

"ఇప్పుడే వచ్చేస్తాను మళ్ళీ" కదిలాడు రామనాథ్.

ఒక్కగంతులో రామనాథ్ దగ్గరకిదూకి చెయ్యిపట్టుకుని ఆపాడు సుదర్శన్.

"మీ ఇంటికి వెళ్ళండి ఇద్దరూ. రేపు మాట్లాడుకుందాం" అన్నాడు రామనాథ్ ఆవలిస్తూ.

లాగి దవడమీద కొట్టాడు సుదర్శన్ పిడికిలి బిగించి.

"స్టుపిడ్. అర్ధరాత్రి నిద్ర చెడుతోందేం?" రొప్పుతూ అడిగాడు.

వడిచేత్తో ఎడమచెయ్యి మెలిపెట్టాడు. బాధతో అరిచాడు రామనాథ్. గబగబా రెండుచేతులతో బాదుతున్నాడు సుదర్శన్ రామనాథ్‌ని గుప్పిళ్ళతో. అందిన ప్రతిచోటా గుద్దుతున్నాడు. దెబ్బలు కాచుకునేందుకు అవకాశం లేకపోయింది రామనాథ్‌కి.

పశుబలంతో, గుండెలు మండుతూంటే ఇష్టంవచ్చినట్టు బాదుతున్నాడు రామనాథ్‌ని. ముక్కులోంచి, నోట్లోంచి రక్తం కారుతోంది. కింద పెదవి పగిలింది. సుదర్శన్ ఎలా తిప్పితే అలా తిరుగుతున్నాడు, మోకాళ్ళతో, మోచేతులతో దెబ్బలుతింటూ. ఎదురు తిరగడానికి మనసొప్ప లేదు

రామనాథ్‌కి తప్పు తనదవడంవల్ల.

సరిత, తన భర్తకోపం చూడలేక పరిగెత్తికెళ్ళి రామనాథ్‌కి అడ్డంవెళ్ళింది.

"నీకూ కావాలా దెబ్బలు?"

సరితని రెండుసార్లుకొట్టి, మూడోసారి కొట్టడానికి చెయ్యి ఎత్తబోతూండగా చూసాడు సుదర్శన్, రామనాథ్ నేల మీదకి కూలిపోవటం.

వంగి చూసాడు. సొమ్మసిల్లిపోయాడు రామనాథ్. గుండెలమీద చేతినివుంచి చూసాడు. ముక్కుదగ్గర వేలినుంచి చూసాడు.

"ఏమయింది?" అడిగింది సరిత.. అలా అడిగితే తన భర్తకి కోపం వస్తుందని తెలిసికూడా.

"చచ్చాడు" కసిగా అన్నాడు సుదర్శన్.

"పశువులా మీదపడి బాది చంపేసారు," అన్నది సరిత కోపంగా.

"పశువులతో పశువుల్లానే ప్రవర్తించాలి."

సుదర్శన్ గది నలువైపులా పరిశీలనగా చూసాడు. ఓ మూలాన ఎర్రరంగుపెట్టె పెద్దది కనిపించింది.

సుదర్శన్ ఆ పెట్టెవంక పరిశీలనగా చూసాడు, చేతులతో పొడవు, వెడల్పు కొలుస్తూ. చెక్కతో చేసినపెట్టె అది. నాలుగున్నరడుగులపొడవు, రెండున్నరడుగుల వెడల్పు వుంది. తాళంలేదు. చిన్న కొక్కెంవుంది, తాళంవేయడానికి వీలుగా.

మూత తెరచిచూసాడు. లోపల పాతబట్టలు, చిరిగిపోయిన బట్టలు, కొంత స్టీల్ సామాను వున్నాయి. వాటిని బయటికితీసి మంచంకిందకి తోసాడు సుదర్శన్, బయటికి కనపడకుండా.

సుదర్శన్, రామనాథ్ శవం దగ్గరికివెళ్ళి, పక్కన కూర్చుని, అతని జేబులు వెతికాడు. ఏమీలేవు జేబుల్లో. తనతో తెచ్చిన జ్లేడ్‌తో షర్ట్‌కి, పేంట్‌కివున్న టైలర్ లేబిల్స్ కోసేసాడు. చేతిగడియారంతీసి వాటితోబాటుగా జేబులో వేసుకున్నాడు.

"సాయంపట్టు" అన్నాడు.

"నాకు భయం" అన్నది సరిత.

"చచ్చిపోయాడు. ఏంచెయ్యలేడు. సాయంపట్టు."

"అందుకే నాకు భయం. నాకు శవాలంటే చచ్చేంత భయం."

తనే తంటాలు పడ్డాడు రెండు చేతులతో రామనాథ్‌ని ఎత్తడానికి. సరితమీద గొణుక్కుంటున్నాడు.

తలుపు చప్పుడైంది.

భయంగా ఇద్దరూ ఒకరిమొహాలొకరు చూసుకున్నారు.

తలుపు చప్పుడైంది మళ్ళీ. ఎవరో తలుపుమీద బాదుతున్నారు దబదబా.

3

"ఎవరో వచ్చారు" అన్నది సరిత వణికిపోతూ.

"అవును."

"పోలీసులేమో?"

"పోలీసులకి అప్పుడే ఎలా తెలిసివుంటుంది? ఈ పెట్టె వాళ్ళ చేతుల్లోపడి, తెరచి చూస్తేగాని తెలియదు."

బలమంతా వుపయోగించి రామనాథ్ శవాన్ని రెండు చేతులతో ఎత్తి, ఆ ఎర్రపెట్టెలో కుక్కాడు సుదర్శన్. మూత మూసేసాడు కంగారుగా. ఆ పెట్టెమీద ఓ దుప్పటి కప్పాడు, మంచంకిందకి తోసేందుకు ఓపిక, చోటు, సమయం లేక.

తలుపుబాదే శబ్దం అధికం అవుతోంది. ఇంకా బలంగా బాదుతున్నారు.

"అలా వెర్రిమొహం వేసుకుని నించోక. ఎవరయినాసరే మాట్లాడి పంపేస్తాను. పద చూద్దాం ఎవరో."

ఇద్దరూ వీధిగుమ్మంవైపు కదిలారు. తలుపు తెరిచాడు సుదర్శన్ అదిరే గుండెలతో.

ఎదురుగా పోలీసులు లేరు సరిత భయపడ్డట్టుగా.

ఓ ముసలాయన నిలబడివున్నాడు చేతిలో చిన్న ఏర్ బేగ్‌తో.

"రామ్‌నాథ్ లేడా?"

భార్యాభర్తలిద్దరివంకా అనుమానంగా చూస్తూ అడిగాడు ఆ ముసలాయన.

"ఎవరు మీరు?" అడిగాడు సుదర్శన్ మర్యాద వుట్టిపడేలా.

గుమ్మందాటి లోపలికి వచ్చాడు ఆయన. సిల్కులాల్చీ, గ్లాస్కోపంచె, రోల్డ్‌గోల్డ్ ఫ్రేమ్, బట్టతల, కాళ్ళకి చెప్పులు.

"రామ్‌నాథ్ లేడా? నేను రామనాథ్ బాబాయిని."

"లేడు. బయటికి వెళ్ళాడు," చెప్పాడు సుదర్శన్.

"మీరు!"

"స్నేహితులం."

"ఎప్పుడు వస్తాడు రామనాథ్? సినిమాకి వెళ్ళాడా?"

"ఊరు."

"ఏవూరు?"

"కడప" తడుముకోలేదు సుదర్శన్.

"మీ రిద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారా?"

"లేదు. క్లబ్‌లో పరిచయం మాకు."

"లోపలకు వెళ్దాం రండి" అన్నాడు రామనాథ్

బాబాయి.

ఆ ముసలాయన లోపలకి నడిచాడు. ఇద్దరూ ఆయన వెనకే దారితీశారు. గుండెల్లో రాయిపడ్డట్టయింది ఇద్దరికీ ఆయన లోపలికి రావడం.

"కోర్టుపనిమీద నల్లగొండనుంచి వచ్చాను. రెండుమూడు రోజులపని వుంది."

"అయితే... రెండురోజులూ ఇక్కడే వుంటారా?"

"ఉందామనే వచ్చాను," నవ్వి అన్నాడు ఆయన.

సుదర్శన్ మౌనంగా వుండిపోయాడు.

"మీరు ఇక్కడే వుంటారా?" అడిగాడు.

"లేదు. వెళ్ళిపోతాం ఇంకో పావుగంటలో. సినిమా నుంచి తిరిగివెళ్తూ తలుపు తెరచి చూడటానికి వచ్చాం అంతా సరిగ్గా వుందో లేదోనని, రామనాథ్ మమ్మల్ని ఇల్లు చూస్తుండమని చెప్పి వెళ్ళాడు."

"ఈ రెండు రోజులు నేనుంటాను మీకాశ్రమ అక్కర్లే కుండా."

సరిత భర్తవంక చూసింది ఏం చెప్తాడోనని.

"క్షమించండి. మీరు మరోలా భావించవద్దు. మీ రెవరో మాకు తెలియదు.ఇలాంటి సందర్భంలో ఇక్కడ మీరుండటం భావ్యంకాదు."

"నేను రామనాథ్ బాబాయిని."

"కావచ్చు. అయినా మాకు రూఢిగా తెలియదా సంగతి. అసలు రామనాథ్‌కి బాబాయి వున్నారనే సంగతి కూడా తెలియదు నాకు."

ఆయన మొహం ఎర్రబడింది కొద్దిగా.

"ఆల్ రైట్. రెండు రోజుల భాగ్యానికి హోటల్‌లో వున్నా ఒకటే, ఇక్కడున్నా ఒకటే."

అయిదు నిమిషాలు కూర్చుని వెళ్ళిపోయాడాయన.

"అమ్మయ్య," అన్నది సరిత ఆయన వెళ్ళగానే. కొద్ది సేపాగి సరితను కూడా ఆమె పుట్టింటికి పంపించివేసాడు సుదర్శన్ బలవంతంగా. జరిగిన విషయం పొరబాటుగానైనా ఎక్కడా నోరు జారవద్దని హెచ్చరించి మరీ పంపాడు. సరిత అయిష్టంగానే అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

4

"చాలా బరువుందిసార్. మీరో చెయ్యి వెయ్యండి" అన్నాడు రిక్షావాడు పెట్టెని లాగిచూసి. సాయంపట్టాడు సుదర్శన్.

రిక్షాలో పెట్టాక అడిగాడు రిక్షావాడు, సుదర్శన్‌ని.

"చాలా బరువుందిసార్. ఏంవున్నాయి ఈ పెట్టెలో?"

నిజమే. చాలా బరువుంది. ఉేకుపెట్టె బరువు. శవంతో అయితే ఇంకా బరువు.

"ఇనపసామానుంది."

రిక్షా తొక్కుతూ అడిగాడు రిక్షావాడు.

"ఏం సామానుసార్?"

"పంపుగొట్టాలు."

చేతిగడియారంవంక చూనుకున్నాడు సుదర్శన్ వీధి దీపం వెలుగులో. తొమ్మిది పదినిముషాలైంది. అయిదు నిము షాల తర్వాత స్టేషన్‌లోని రిక్షాస్టాండులో ఆపాడు రిక్షాని, రిక్షావాడు.

పోర్టర్‌ని పిలుచుకువచ్చాడు సుదర్శన్. రిక్షావాడికి డబ్బిచ్చి పంపేసాడు. ఆ సమయంలో రైళ్ళేవీ లేవు. ఏదో రైల్లో ఆ పెట్టెని వదిలేయాలనుకున్నాడు సుదర్శన్. ఉదయం ఐదుగంటలకు ఓ రైలుంది. కాని అప్పటిదాకా ఆ ఎర్ర పెట్టెని ప్లాట్‌ఫారంమీద పెట్టుకుని కూర్చోవటం తనకే ప్రమాదం. తనను, ఆ పెట్టెను అందరూ గుర్తుపెట్టుకునే అవకాశం

వుంటుంది. కావున ప్రస్తుతానికి ఆ పెట్టెని క్లోక్ రూమ్‌లో పెట్టి వెళ్ళడం శ్రేయస్కరమనిపించింది సుదర్శన్‌కు. పోర్టర్‌తో క్లోక్ రూమ్ వైపు దారితీశాడు. తెరిచేవుంది క్లోక్ రూం.

"చాలా బరువుంది సార్. ఏం వుంది పెట్టెలో?"

"బంగారపు ముద్దలు" నవ్వుతూ అన్నాడు సుదర్శన్. వెంటనే పొరపాటు చేశానని నాలిక కొరుక్కున్నాడు. 'బంగారపు ముద్దలు' అన్న మాట గుర్తుంటుంది పోర్టర్‌కి. తనుకూడా గుర్తుంటాడు దాంతోపాటు.

రూపాయి తీసి అందిచ్చాడు.

"ఇంకో అర్ధరూపాయి ఇవ్వండి సార్. మరీ తక్కువ. ముగ్గురు మోసే బరువుంది."

సుదర్శన్ మాట్లాడకుండా మరో అర్ధరూపాయి ఇచ్చాడు రైల్వే పోర్టర్‌కి, అది ఎక్కువేనని తెలిసినా. బేరం ఆడటం ఇష్టంలేదు.

"దీన్ని వుంచాలండి. రేపు ఉదయం తీసుకుంటాను" చెప్పాడు సుదర్శన్ లోపలవున్న అతనితో.

అలాగే నన్నట్లుగా చిరునవ్వు నవ్వాడు అతను.

ఓ పుస్తకం తీసి, కార్బన్ కాపీవుంచి గబగబా ఏదో రాయసాగాడు క్లోక్ రూంలో వున్న అతను.

సుదర్శన్ అతనందించిన చీటీ అందుకుని, అర్ధరూపాయి ఇచ్చి, చిల్లర తీసుకుని, చీటీ జేబులో వేసుకున్నాడు చిల్లరతోపాటుగా.

5

సుదర్శన్‌కు గుండెల్లో మండిపోతోంది, సరిత అవినీతికి.

తన భార్య వేశ్యా ప్రవృత్తి తినేస్తోంది మనస్సుని. ఎంత కృతఘ్నత? ఇక ఎలా కాపరం చేయగలడు కులటతో? తన

భవిష్యత్తు ఏమవుతుంది? అందరూ తననిచూసి నవ్వుకుం టూరు పెళ్ళాం ఇలాంటిదని వేలెత్తి చూపిస్తూ. తను తలెత్తు కుని ఎలా తిరగడం? సరితని ఏంచేయాలి? అసలు ఆ ఎర్ర పెట్టెని ఏంచేయాలి? మరునాడు భోజనం చేస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు సుదర్శన్.

అవును. వెనక్కి తీసుకోకుండా వుంచేస్తే ఏమవుతుంది? తనెవరో ఎవరికీ తెలియదు. రెండు మూడు రోజులు చూసి, వాసనవస్తే, అనుమానం కలిగితే బ్రద్దలుకొట్టి చూస్తారు పెట్టెని. అప్పటికి తన రూపురేఖలు మర్చిపో తారు ఆ క్లోక్ రూంలోని మనిషి, పోర్టర్ కూడా.

రామనాథ్ శవాన్నికూడా గుర్తించలేరు.

పదిలక్షలమందివున్న ఈ సిటీలో ఎవరినని హంతకుడిగా పోల్చగలరు?

ఓ నెలరోజులు శెలవుపెట్టి వెళ్ళాలి ఎటైనా. ఆ నెల రోజులూ ఎక్కడున్నదీ తెలియకూడదు ఎవరికీ. ముఖ్యంగా పోలీసులకి. తనని అనుమానిస్తున్నారా అన్న విషయం గురించి రహస్యంగా ఆరా తియ్యాలి తను రాబోయేముందు.

తను ఆలోచించిన పథకం బాగానే వున్నట్లుగా అనిపిం చింది సుదర్శన్ కి. తృప్తిగా నిట్టూర్చాడు.

గుడ్ ఐడియా. క్లోక్ రూం రసీదు చింపేసాడు జేబు లోంచి తీసి.

వాష్ బేసిన్ లో చేతులు కడుక్కుని, కౌంటర్ ముందుఆగి టెలిఫోన్ రిసీవర్ అందుకున్నాడు, కౌంటర్ లోవున్నతని అనుమతిమీద.

ముందర రామనాథ్ ఆఫీస్ నంబర్ తిప్పాడు, డైరె క్టరీలో అతని ఆఫీసు నెంబర్ వెదకి.

"హలో" వినిపించింది అవతలనుంచి ఆపరేటర్ కంఠం.

"మేనేజర్ కి కనెక్షన్ ఇవ్వండి" చెప్పాడు.

ఆపరేటర్ మేనేజర్ ఎక్స్‌టెన్షన్‌కి కనెక్ట్ చేస్తున్న చప్పుడు వినిపించింది.

"హలో" వినిపించింది మళ్ళీ.

జేబురుమాలు జేబులోంచితీసి ముఖం తుడుచుకున్నట్లుగా నటించి, ఆ రుమాలని మౌత్‌పీస్‌కి అడ్డంగావుంచి అడిగాడు సుదర్శన్.

"హలో, మేనేజర్?"

"యస్ ప్లీజ్."

టైప్‌రైటర్ శబ్దం వినిపిస్తోంది.

"నేను రామనాథ్ మిత్రుడిని."

"రామనాథ్ రావటంలేదా?" వెంటనే వినిపించింది మేనేజర్ కంఠం కోపంగా.

"అవును. మీకు ఫోన్‌చేసి చెప్పమన్నాడు."

"ఎప్పుడు వస్తాడు?"

"మరో వారందాకా రాడు. ఊరెళ్ళాడు వాళ్ళమ్మగారు పోయారని తెలిసి."

"అరెరె. నాకు తెలీదే."

మేనేజర్ కంఠంలో ఈసారి కోపం సూచనామాత్రంగానైనా లేదు.

"అవును, రాత్రి టెలిగ్రాంవస్తే వెళ్ళాడు. మీకు ఫోన్ చేసి చెప్పమన్నాడు."

"అలాగే అయితే."

"థాంక్స్."

హుక్ నొక్కాడు. తన ఆఫీస్ నంబర్ తిప్పాడు, రుమాల అడ్డంతీసి. బెల్ మోగుతోంది అటువైపు.

"హల్లో" వినిపించింది బాస్ కంఠం.

"నేను సుదర్శన్ మాట్లాడుతున్నానుసార్. ఇవాళ, రేపు శెలవు కావాలిసార్," చెప్పాడు.

"మీకు లీవ్ వుందికదా. ఏంపని?"

"ఉందిసార్ చుట్టాలొచ్చారు."

"ఆల్ రైట్. తీసుకోండి."

"థాంక్యూ సర్."

క్లిక్ మనేదాకా పెట్టలేదు సుదర్శన్. తన బాస్ రిసీవర్ పెట్టేశాక తనూ క్రెడిల్ మీద వుంచాడు రిసీవర్ని. తనకి లీవ్ దొరకదని ఎప్పుడూ ఇబ్బంది పడక్కరలేదు. చాలా పొదుపుగా వాడతాడు తను. అత్యంత అవసరంవస్తే కాని తను శెలవు పెట్టడని తెలుసు బాస్కి. ఎప్పుడైనా కావా అంటే వెంటనే మంజూరు చేస్తాడు.

జేబులోంచి చిల్లరతీసి రెండు ఫోన్ కాల్స్కి చెల్లించాడు సుదర్శన్. ఓ ఖాళీ సోఫాలో కూర్చుని, జేబులోంచి కలం, కాగితం తీసి, అంతదాకా రామనాథ్ శవం వున్న ఎర్ర పెట్టెని వదిలించుకోవడానికి తను పెట్టిన ఖర్చు అంతా లెక్కరాసుకుని చూసుకున్నాడు ఎంతయిందో.

లేవబోతూంటే పలకరించారు ఎవరో.

"హలో మిస్టర్ సుదర్శన్."

"హలో" అపరిచిత వ్యక్తివంక చూసాడు గానిఎక్కడ ఇదివరకు చూసాడో గుర్తురాలేదు వెంటనే. సుదర్శన్ మొహంలోని భావం గుర్తించి అన్నాడావ్యక్తి.

"జ్ఞాపకంలేనా? మీ వెనక సందులో అద్దెకుందేవాడిని నాలుగేళ్ళక్రితం."

తలూపాడు గుర్తువచ్చినట్లుగా, గుర్తురాకపోయినా.

"నిన్న మా ఆఫీస్కి వచ్చారటగా రాత్రి."

"మీ ఆఫీస్కా?"

"అవును. ఓసారి మా కొలీగ్ని పరిచయం చేసాను మీకు క్రికెట్ మాచ్ చూడటానికి మనమంతా వెళ్ళినప్పుడు. అతను చెప్పాడు."

"పొరపడ్డారు నిన్నరాత్రి నేను మీ ఆఫీస్ కి రాలేదే?"

"వచ్చారు. ఓ ఎర్రపెట్టెని భద్రపరిచారటగా క్లోక్ రూంలో?" నవ్వుతూ అడిగాడు అతను.

"మీరు...?"

"క్లోక్ రూంలో పనిచేస్తాను. అప్పుడే మర్చిపోయారే?" సుదర్శన్ గుండె కొట్టుకునే వేగం అకస్మాత్తుగా పెరిగింది.

"స్టేషన్ లోని క్లోక్ రూమ్ లో పనిచేస్తారా మీరు?" అడిగాడు సుదర్శన్. అతనివంక గుచ్చిగుచ్చి చూస్తూ.

"అవును. కులాసానా? అక్కగారెలా వున్నారు?"

'అక్కగారు' అంటే సరిత అయివుండచ్చని అనుకున్నాడు సుదర్శన్. చేత్తోనే కులాసా అన్నట్లుగా సౌంజ్ఞ చేశాడు నోరు పెగలక.

"మీరు బాగా చిక్కిపోయారు, మిమ్మల్ని చూసిచాలా రోజులైంది."

"అవును" తేరుకుంటున్నాడు నెమ్మదిగా.

"మా కొలీగ్ రాత్రి షిఫ్టులో వున్నాడు. అతను చెప్పాడు నాకు ఏక్సిడెంటల్ గా మీరు ఓ ఎర్రపెట్టెని భద్రపరచిన సంగతి."

క్రితంరాత్రి క్లోక్ రూమ్ లోని అతను చిల్లర తిరిగి ఇస్తూ తనవంక చూసి నవ్వటం గుర్తువచ్చింది సుదర్శన్ కి. ఆలోచిస్తే ఇప్పుడు, ఆ నవ్వుల్లో పలకరింపుకూడా వుందనిపించింది సుదర్శన్ కి.

"మీరుకూడా చాలా ఏక్సిడెంటల్ గా కలిసారు ఇప్పుడు."

"అవును. ఏమిటి పరాకుగా వున్నారు?"

"ఏం లేదు. మీ సహాయం కావాలి."

"ఏమిటి? అడగండి."

గొంతు సద్దుకుని చెప్పాడు సుదర్శన్.

"ఆ పెట్టె తీసుకోవాలి నేను మళ్ళీ అర్జెంట్ గా."

"తీసుకోండి, నావెంటవస్తే ఇస్తాను. ఇంకో అరగంటలో నాకు డ్యూటీవుంది ఎలాగైనా."

"కాని నా దగ్గర అతనిచ్చిన రిసీట్ లేదు."

"ఆ లగేజ్ రిసీట్?"

"అవును పోయింది."

"అరె! ఎలా పోయింది? అది చాలా ముఖ్యమే?"

"పొరపాటున చూసుకోకుండా చాకలికి వేసిన బట్టల్లో పోయింది. తర్వాత చూస్తే లేదు."

అతను మౌనంగా వుండిపోయాడు.

"మీరు నాకు తెలిసినవాళ్ళు. నేను నేనేనని మీకు తెలును.ఇవ్వడానికి మీకు అభ్యంతరం వుండదనుకుంటాను."

"అలా ఇవ్వడం కష్టం."

"ఏం?"

"తర్వాత ఆడిటర్స్ అబ్జెక్ట్ చేస్తారు. నాకు మాట వస్తుంది."

"మరేం చెయ్యాలి?"

"మీరు వ్రాసివ్వండి ఓ అప్లికేషన్ మీ లగేజ్ రిసీట్ పోయినట్లుగా. కొంతకాలం ఆ పెట్టెవుంచిన తర్వాత, పెట్టె ఎవరూ క్లెయిమ్ చేయకపోతే, మీ కిస్తారు, లోపలి వస్తువులు మీరు చెప్పినవి కరెక్ట్‌గావుంటే."

"అంటే ఎంతకాలం?"

"నెల రోజులు."

నెల రోజులు?!

నాలుగయిదు రోజులుపోతే వాసన బయటకి స్పష్టంగా వేస్తుంది.

"చూడండి సార్. మీరు ఎలాగైనా నాకు సాయపడాలి ఈ విషయంలో, లేకపోతే గొప్ప చిక్కులో ఇరుక్కుంటాను."

"ఏం చిక్కు."

"దాంట్లో ఆఫీస్ ఓల్డ్ రికార్డ్స్ వున్నాయి. వెంటనే రేపు ఆఫీస్‌లో ఇచ్చెయ్యాలి వాటిని. ఇంటికి తీసుకురావడం బద్ధకం వేసి క్లోక్‌రూంలో వుంచాను."

మౌనంగా ఆలోచిస్తూండి పోయాడు అతను.

"కావాలంటే మీకు ఇండెమ్నిటీ బాండ్ కూడా రాసిస్తాను."

"రూల్స్ ఒప్పుకోవు."

"ప్లీజ్. ఎలాగైనా మీరీ సహాయం చేయాలి నాకు. లేకపోతే డిస్మిస్ కూడా అవచ్చు నేను."

సుదర్శన్ అతని చేతులు పట్టుకున్నాడు ప్రాధేయ పూర్వకంగా.

"ఆల్ రైట్. పదండి" అన్నాడు అతను.

దీర్ఘంగా నిట్టూర్చాడు సుదర్శన్. భుజంమీద నుంచి సహం బరువు తీరినట్లయింది. ఇద్దరూ బయటకి వచ్చారు.

రిక్షా పిలిచాడు సుదర్శన్, అతను వద్దంటున్నా. బలవంతంగా మధ్యలో కోకోకోలా తాగించాడు అతనికి. ఇరవై నిముషాల తర్వాత చేరుకున్నారు స్టేషన్‌కు.

క్లోక్ రూమ్ రేక్స్‌నిండా పేర్చివున్న సామాను వంక ఓసారి చూసి, మూలగా నేలమీదవున్న తన ఎర్రపెట్టె వంక చూసాడు సుదర్శన్.

సుదర్శన్ స్నేహితుడి కొలీగ్ వెళ్ళిపోయాడు, అతనికి డ్యూటీ అప్పచెప్పి.

అతను చెప్పిన విధంగా కాగితంమీద వ్రాసి, సంతకం పెట్టి, తన ఎర్రపెట్టెని పోర్టర్‌చేత బయటకి మోయించుకు వచ్చాడు సుదర్శన్.

రిక్షా వచ్చి రామనాథ్ పోర్షన్ ముందు ఆగింది.

"ఓ చెయ్యి వెయ్యండి మీరు కూడా" అన్నాడు రిక్షా

వాడు రిక్షాలోంచి పెట్టెని దింపుతూ.

"ఉండు. తలుపు తెరచి వస్తాను."

సుదర్శన్ రామనాథ్ పోర్షన్ తలుపు తాళం తెరచి లోపల లైటు వెలిగించి వచ్చాడు. ఇద్దరూ కలిసి లోపలికి తీసుకువెళ్ళారు పెట్టెని.

"ఏముంది దొరా ఆ పెట్టెలో? చచ్చిన వాడంత బరువుంది" అడిగాడు రిక్షావాడు చేతులు విదిలించుకుంటూ.

"లోపల చచ్చినవాడే వున్నాడు. నీ కెందుకు పో. పో" కసురుకున్నాడు సుదర్శన్.

"వెధవలు. ప్రతీ వక్కడూ అడిగే వాళ్ళే" గొణుక్కున్నాడు ఆ ఎర్రపెట్టె వంక చూస్తూ.

6

దాదాపు ఇరవై గంటలవుతోంది రామనాథ్‌ని తను చంపి. మరో ఇరవై నాలుగు గంటలు దాటితే, వాసన వేస్తుంది శవం.

నలభై ఎనిమిది గంటల తర్వాత వేసే వాసన బయటకి రాదు ఆ బలిష్టమయిన టేకు పెట్టెలోంచి.

కాని మూడు రోజులు దాటితే మాత్రం బయటకి స్పష్టంగా వేస్తుంది అందరినీ ఆకర్షిస్తూ.

సిగరెట్ వెలిగించాడు సుదర్శన్.

చప్పుడయింది సుదర్శన్ అగ్గిపుల్ల పారేస్తూంటే.

ఉలిక్కి పడ్డాడు సుదర్శన్. చెక్కమీద ఎవరో కొడుతున్న చప్పుడుగా గ్రహించాడు. రామనాథ్ లోపలనుంచి కొడుతున్నాడన్న భావన నిలువెల్లా కంపించేలా చేసింది సుదర్శన్‌ని. అనుమానంగా పెట్టెవంక చూసాడు.

మళ్ళీ వినపడింది చప్పుడు.

శ్రద్ధగా విని వూపిరి వదిలాడు. తలుపు చప్పుడు. ఎవరో తలుపు కొడుతున్నారు బయటనుంచి_ పెట్టెలోంచి కాదు.

ఎవరై వుండచ్చు? ఎవరు వస్తారు ఈ సమయంలో రామనాథ్ కోసం? కొంపతీసి పోలీసులు కాదు కదా?

తలుపు దగ్గరికివెళ్ళి గడియ తెరిచాడు.

పోలీసులు కాదు.

ఎవరో నలభైఏళ్ళతను నిలబడివున్నాడు లుంగీ, బనియన్లలో, నోట్లో చుట్టతో.

"ఎవరు కావాలి?" అడిగాడు సుదర్శన్ అతని ఆకారం వంక చూసి. అతన్ని ఎప్పుడూ చూడలేదు అంతకు మునుపు.

మీ రెవరన్నట్లుగా చూస్తూ అడిగాడు ఆ కొత్త వ్యక్తి.

"రామనాథ్ లేడా!"

"లేడు. మీరు...?"

"ఎక్కడికి వెళ్ళాడు? మీకేమవుతాడు?"

"స్నేహితుడు. వూరు వెళ్ళాడు. మరో వారం దాకా రానని చెప్పివెళ్ళాడు."

"మేం ఈ పక్క పోర్షన్లో ఉంటున్నాం. ఇదయమే వూరినుంచి తిరిగి వచ్చాం. అలికిడయితే రామనాథ్ వచ్చి వుంటాడనుకున్నాం."

"లేదు. రాలేదు."

సుదర్శన్ భుజాలమీదగా చూసాడు అతను గుప్పుగుప్పుమని పొగ వదులుతూ ఆ ఎర్రపెట్టె వంక.

దాంట్లో ఏం వుంది అని అడుగుతాడనుకున్నాడు కాని, అడగకుండా తన పోర్షన్లోకి వెళ్ళిపోయాడు అతను. తలుపు మూసాడు సుదర్శన్ ఆసంతృప్తితో. ఆ ఎర్రపెట్టెని తొందరగా వదిలించుకోవాలి. ఆలస్యం అవుతున్న కొద్దీ తనకు ఆపద చేరువవుతున్నట్లుగా వూహించాడు సుదర్శన్.

7

శబ్దం గాకుండా తలుపు తెరచి రోడ్డుమీదకి చూసాడు సుదర్శన్.

అర్ధరాత్రి దాటింది కాబట్టి నిర్మానుష్యంగా వుంది రోడ్డు పూర్తిగా.

రెండు చేతులతో అతి ప్రయత్నంమీద ఎర్రపెట్టెని భుజాలమీదకి ఎత్తుకున్నాడు సుదర్శన్. రోడ్డుమీద ఎవరూ కనపడకూడదని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, రెండిళ్ళ అవతల, సందు చివరవున్న ఖాళీస్థలంలో వేగంగా నడిచాడు సుదర్శన్, ఆ చిమ్మచీకటిలో.

ఇల్లు కట్టలేదు ఆ ఖాళీ స్థలంలో. చుట్టూ ప్రహారీ గోడ మాత్రం పెట్టారు. ఓ మూల ఇసుక దిబ్బవుంది. గోడమీద నుంచి ఇసుక దిబ్బమీదకి పడేశాడు సుదర్శన్ ఆ ఎర్ర పెట్టెని. చప్పుడు చెయ్యలేదు పెట్టె కొంచెం కూడా, ఇసుక దిబ్బమీద పడడంవల్ల.

ఓసారి వూపిరి పీల్చుకుని గబగబా పరిగెత్తాడు రామనాథ్ పోర్షన్ వైపు. సిద్ధంగా వుంచిన పార, పలుగు అందుకుని, లైటార్పి, తలుపు శబ్దం కాకుండా మూసి, బయట గొళ్ళెం పెట్టి తాళం వేసాడు.

మళ్ళీ ఓసారి జాగ్రత్త కోసం రోడ్డుమీదకి చూసి, ఎవరూ లేరని నిర్ణయించుకున్నాక ఆ ఖాళీ స్థలం వైపుకు పరిగెత్తాడు. రెండంగల్లో చేరుకున్నాడు. గోడమీద నుంచి ఎక్కి అవతలకి దూకాడు. ఇసుక దిబ్బమీద పడ్డాడు.

కటిక చీకటిగా ఉంది లోపలంతా. పగలు చాలాసార్లు చూడటంవల్ల, లోపల ఎలా వుంటుందో తెలుసు సుదర్శన్‌కి. నాలుగు వైపులా పునాది తీసారు. మధ్యలో తవ్వాలి, నాలుగు పునాది స్థంభాల మధ్య. గది పడబోయే చోటంతా మట్టే.

ఆ మట్టిలో కప్పెడితే పైన త్వరలో గది పడిపోతుంది. ఇల్లు తయారయ్యాక ఇక ఎవరికీ తెలియదు, తెలిసే అవకాశం కూడా వుండదు.

రామనాథ్ 'మిస్సింగ్'గా మిగులుతాడు.

కాశీలో సన్యాసుల్లో కలిసి పోయాడని, ప్రచారం చేయచ్చు.

ఇనుప గునపంతో తవ్వసాగాడు మధ్య, సుదర్శన్ గబ గబా. తనవెంట తెచ్చిన టార్చి లైట్ చూట్టూ గుడ్డచుట్టి వెలిగించి, తను తవ్వే చోట మాత్రం మందంగా వెలుగు పడేలా ఏర్పాటు చేసాడు సుదర్శన్.

తవ్వి చేతులతో, పారతో గుబగబా మట్టి తీస్తున్నాడు. ఆరున్నరడుగుల లోతయినా వుండాలి కనీసం. నాలుగడుగులు పెట్టెపోతే, పైన రెండున్నరడుగులు మట్టి. వర్షం వచ్చినా చేసినా బయటపడదు పెట్టె.

ఖర్మకాలి వకవేళ బయటపడ్డా లోపల రామనాథ్ గుర్తు పట్టలేని స్థితిలో వుంటాడు. భయం వుండదు తనకి.

ఆగిపోయాడు త్రవ్వడం ఆపి.

ఎవరో ఇద్దరు రోడ్డుమీద మాట్లాడుకుంటూ నడిచి వెళ్తున్నారు. వాళ్ళు దూరం అయాక మళ్ళీ త్రవ్వసాగాడు సుదర్శన్ గబగబా. మట్టంతా కుప్పగా ప్రక్కగా పోస్తున్నాడు.

టకటకా చప్పుడయింది దూరంగా అరగంట తర్వాత.

గూర్ఖా.

గుండెలు టకటక కొట్టుకుంటున్నాయి సుదర్శన్‌కి. ఈ ఖాళీ స్థలంలో కూడా బ్యాటరీ లైట్ వేసి చూస్తాడా!

ఇళ్ళ తలుపులమీద కర్రతో కొట్టుకుంటూ వస్తున్నాడు గూర్ఖా. వూపిరి బిగపట్టి అలాగే కూర్చున్నాడు సుదర్శన్ గబగబా తవ్వుతూ, ఏమయితే అదే అవుతుందని.

గూర్ఖా మరీ దగ్గరవగానే త్రవ్వడం ఆపాడు సుదర్శన్.

అదృష్టం. గూర్ఖా ఆగి చూడలేదు ఆ ఖాళీ స్థలంలో లైటువేసి.

కూర్గా వెళ్ళాక, బేటరీ లైట్ వేసి చూసాడు సుదర్శన్ నాలుగడుగులు త్రవ్వానని తెలుసుకున్నాడు కాళ్ళు లోపలికి పెట్టి కొలిచి. చాలదు.

అరగంట వూపిరి తిప్పుకోకుండా గబగబా త్రవ్వాడు, ఎంత త్వరగా తన పని తెములుతే అంత మంచిదని.

మూడు ముప్పావుకి చాలా భాగం తయారయింది. నాలుగుంపావుకి పని పూర్తిచేసాడు సుదర్శన్.

రెండు నిముషాలు విశ్రాంతి తీసుకున్నాడు ఆయాసం, అలుపు తీర్చుకుంటూ. తర్వాత ఇసక దిబ్బమీద వున్న ఆ పెట్టెని, ఇసకమీదే దొర్లించుకుంటూ గోతి దగ్గరకి తీసుకువచ్చాడు.

గోతిలోకి తోసాడు పెట్టెని.

పెట్టె గోతిలోకి పడ్డాక తన తప్పు తెలుసుకున్నాడు సుదర్శన్. పెట్టెకున్న ఓ అంచు పైకి కనిపిస్తోంది గోతిలోంచి. పెట్టె కొలత ప్రకారం, అరడుగు ఎక్కువ వెడల్పుగా త్రవ్వాడు. కాని పెట్టెని గోతిలోకి సరిగ్గా దింపలేదు.

మరో పది నిముషాలు తంటాలు పడ్డాక పెట్టెని గోతిలో సర్దాడు సుదర్శన్. చివరి నిముషంలోకూడా తనకి ట్రబుల్ ఇస్తున్నాడు రాస్కెల్, అనుకున్నాడు సుదర్శన్.

తర్వాత గబగబా పారతో త్రవ్వి బయటకి తీసిన మట్టిని గోతిలో తోసి పూడ్చసాగాడు. అరగంట అవకుండానే గోతిని పూడ్చేసాడు; రెండు కాళ్ళతో ఆ ప్రాంతమంతా తొక్కి, సమిసాచేసి, మట్టి పూడ్చాడు.

కాని ఇంకా చాలా మట్టి మిగిలిపోయింది కుప్పగా బయట. ఓ పక్కగా పారతో ఆ మట్టిని కొంచెం కొంచెం అక్కడక్కడా చల్లి అంతా సమానంగా వుండేలా చూసాడు సుదర్శన్.

ఆ చీకటిలో అక్కడ ఎలావుందీ కనపడటం లేదు స్పష్టంగా. మర్నాడు ఉదయం చూడాలి, అనుమానాస్పదంగా వుందీ, లేనిదీ. ఒక వానపడితే అంతా మళ్ళీ మామూలుగా అయిపోతుంది.

ఇసక దిబ్బమీద కాసేపు పడుకుని, ఆకాశంలోని నక్షత్రాల వంక చూస్తూ, రిలాక్స్ అయాడు సుదర్శన్. కొండంత బరువు తీరినట్లుగా అయింది ఆ ఎర్రపెట్టెని వదిలించుకునే సరికి.

గునపం, పారలతో కదిలాడు. గోడమీదకి ఎక్కి బయటకి చూసాడు. దూరంగా ఏదో వేన్ వస్తోంది. చటుక్కున లోపలికి దూకి ఆ వేన్ వెళ్ళేదాకా పొంచి వుండిపోయాడు గోడకి ఆనుకుని.

పోలీస్ వేన్ అది!

నైట్ పెట్రోల్ వేన్!

గోడమీదకి దూకి రామనాథ్ పోర్షన్ చేరుకున్నాడు సుదర్శన్. తలుపు తాళం తెరచి, లోపలికి వెళ్ళి తలుపు గడియ పెట్టుకున్నాక 'అమ్మయ్యా' అనిపించింది సుదర్శన్ కి.

లోపల దొడ్లోకి వున్న తలుపు తెరచి గునపాన్ని, పారనీ యథాస్థానంలో వుంచేసాడు.

శుభ్రంగా కాళ్ళూ చేతులూ మొహం కడుక్కున్నాడు. లోపలికి వచ్చి, టవల్ ని తీసుకుని పొడిగా తుడుచుకున్నాడు వళ్ళు.

మనస్సంతా ప్రశాంతంగా, తేలికగా వుంది సుదర్శన్ కి తను చేసిన పనికి, ఆ ఎర్రపెట్టెని వదుల్చుకోగలిగినందుకు.

వేడివేడి కాఫీ తాగితే ఇంకా ప్రాణానికి హాయిగా వుంటుందనిపించింది. వంటగదిలోని ఎలక్ట్రిక్ స్టవ్ మీద వేడినీళ్ళకి గిన్నె పడేసాడు నీళ్ళుపోసి.

అయిదు నిముషాలలో కాఫీ చేసుకున్నాడు, పాలు లేకుండానే.

వేడివేడి బ్లాక్ కాఫీ తాగాక త్రవ్వడంవల్ల ఏర్పడ్డ భుజాల, చేతుల నొప్పులు తగ్గినట్లనిపించింది. తను తాగిన గ్లాసు శుభ్రంగా కడిగి, అన్నీ ఎక్కడివక్కడ సర్ది బయటికి వచ్చాడు.

అంతలో, గుర్తుకు వచ్చింది తను చేసిన చిన్నతప్పు.

టార్చ్‌లైట్. ఇసుకదిబ్బమీద తనకి వెలుగుపడేలా వుంచిన ఆ టార్చ్‌లైట్ అలాగే వదిలేసివచ్చాడు తీసుకు రాకుండా, తిరిగివచ్చే హడావిడిలో.

టార్చ్‌నుండి పడే వెలుగు తను ఆ ఎర్రపెట్టెని పాతి పెట్టిన స్థలం చూపుతూవుంటుంది. ఎవరికయినా అనుమానం కలుగుతుంది ఆ ఇసుకదిబ్బమీద, తను తెల్లబట్ట చుట్టివుంచిన టార్చ్ చూస్తే; రాత్రి ఏదో కుంభకోణం జరిగివుంటుందని వూహిస్తారు కొంచెం తెలివైన వాళ్ళయితే.

తన ఖర్మకాలితే చాలాదూరం వెళుతుంది.

రామనాథ్ ఇంటికి తాళంవేసి, గబగబా నడవసాగాడు. పాలకోసం సీసాలుతీసుకుని ఒకళ్ళిద్దరు తిరుగుతూకనిపించారు గబగబా ఆ ఖాళీస్థలం ప్రహరీగోడ దగ్గరికి వెళ్ళాడు సుద ర్శన్.

కొద్దికొద్దిగా వెలుగురేఖలు వస్తున్నాయి తూర్పువ. చీకటి పోలేదు ఇంకా. ఇంకో అరగంటాగితే కొద్దిగా తెల్లవారు తుంది.

సుదర్శన్ గోడఎక్కి లోపలకి దిగబోయాడు టార్చ్ లైట్ తీసుకోవడానికి. ఇసకమీద అలాగే చెక్కుచెదర కుండావుంది టార్చ్‌లైట్ కాంతి వెదజల్లుతూ.

లోపలకి దిగలేదు సుదర్శన్. అలాగే గోడకి అంటిపెట్టు కుని, ఎదురుగా చూస్తూండిపోయాడు.

గుండె ఘల్లుమంది సుదర్శన్‌కి.

8

సుదర్శన్‌కి దయ్యాలంటే నమ్మకంలేదు. చచ్చినవాళ్ళ శవం బ్రతికి బయటకి రావటం, తిరగడం అంటే ఎంత మాత్రం నమ్మకంలేదు. కాని ఎదురుగా కనపడే దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడైపోయాడు.

ఎదురుగా...

సరిగ్గా ఆ టార్చి వెలుగుపడేచోట...

అరగంటక్రితం తను స్వయంగా పూడ్చినచోట...

గోతిలో వుండాల్సిన పెట్టె బయటవుంది, ఆ ఎర్రపెట్టె!

ఎవరో నిలబడివున్నారు ఆ గోతిలో చలనం లేకుండా!!

క్షణంలో వళ్ళంతా చెమటలు పోసాయి సుదర్శన్‌కు.

కళ్ళు నులుముకుని మళ్ళీ పరీక్షగా చూసాడు సుదర్శన్. ఎదురుగా కనబడుతున్న దృశ్యం.

సందేహంలేదు. ఆ ఎర్రపెట్టె బయటకి వచ్చింది. ఎవడో గోతిలో నిలబడివున్నారు. పరీక్షగా చూసాడు సుదర్శన్.

రామనాథ్!

రామనాథ్ అంత వడ్డు, పొడవు, ఎత్తు వున్నాయి గోతిలో నిలబడ్డతనికి. వంగి దేనికోసమో చూస్తున్నాడు.

సుదర్శన్ చూస్తుండగానే గోతిలోంచి బయటకి వచ్చాడు అతను. చేత్తో దేనితోనో ఆ యెర్రపెట్టె తాళం బ్రద్దలు కొడుతున్నాడు గబగబా!

సుదర్శన్‌కి మొదటినుంచీ దయ్యాలమీద యెంతమాత్రం నమ్మకంలేదు. ఒక్క యెగురు యెగిరి లోపలికి దూకాడు. ఇసుకదిబ్బమీద పడటంవల్ల ఏమాత్రం చప్పుడుకాలేదు. వంగి, పెట్టెతాళం పగలకొడుతున్న అతన్ని చాచితన్నాడు శక్తికొద్దీ తన కాలితో.

దెబ్బతిన్న అతను వెనక్కి తిరిగిచూసాడు అదురుగా.

రామనాథ్ కాడు. మరొకడు.

సుదర్శన్‌ని గుర్తుపట్టిన ఛాయలు కనిపించాయి అతని

మొహంలో. లేచాడు మీదకి. రెండు చేతులు బిగించి, ఒకే గుప్పిటగాచేసి సుదర్శన్ గడ్డంకింద బాదాడు గట్టిగా, బలమంతా వుపయోగించి.

సుదర్శన్ తల తిరిగినట్లయింది. కళ్ళు బైర్లుకమ్మాయి. వెచ్చగా కారింది నోట్లోంచి ఏదో గడ్డంమీదుగా కిందకి.

రక్తం.

మళ్ళీ అదే గుప్పిటతో మరోసారి కొట్టబోయాడు అతను. సుదర్శన్‌లో ప్రెజెన్స్ ఆఫ్ మైండ్ పనిచేసింది. తప్పు కున్నాడు పక్కకి.

వెంటనే వంగొని రెండు చేతులతో ఇసుక అందుకుని అతని మొహంమీద చల్లాడు విసురుగా. అతని మొహానికి ములుకుల్లా గుచ్చుకుని ఇసక రాలిపోయింది కిందకి. కాని రెండు కళ్ళలోపడ్డ ఇసక మాత్రం రాలలేదు కిందకి.

కళ్ళు తెరవలేక పోయాడు అతను. కళ్ళలోని ఇసక మంట పెడుతోంది విపరీతంగా.

"ఎవరు నువ్వు! ఎందుకు ఈ పెట్టె బయటకి తీసావు?"

సుదర్శన్ అతన్ని రెండు చేతులతో బాదుతూ అడిగాడు.

"కొట్టకు. చెప్తాను" అన్నాడు అతను రొప్పుతూ.

"ఎలా తెలుసు నీకు ఇక్కడ పెట్టెవున్నట్లు? చెప్పు?"

"మాసాను నువు ఇందాక గొయ్యితీసి కప్పెడితే."

తృళ్ళిపడి అడిగాడు సుదర్శన్.

"ఇందాక నేను గొయ్యితీసి ఇక్కడ చేసినదంతా చూశావా?"

"అవును."

సుదర్శన్ పరీక్ష చెయ్యలేదు అక్కడెవరన్నా వున్నారా, లేదానని. ఆ చీకట్లో, అంత అర్ధరాత్రి ఎవరు వుంటారని అనుమాన పడలేదు ఎంతమాత్రం.

"ఎందుకున్నావు ఇక్కడ?" అడిగాడు.

"దాక్కున్నాను."

"దేనికి దాక్కున్నావు?"

"పోలీసులకు భయపడి."

"ఏం చేశావు పోలీసులకు భయపడటానికి?"

"దొంగతనం."

"దొంగవా!"

"అవును."

దొంగ!

"హత్యలుకూడా చేస్తావా?"

"ఎప్పుడూ చెయ్యలేదు."

హంతకుడు కాకపోయినా దొంగ. వీడిని ఉపయోగించుకోవాలి. దొంగలు, హంతకులు తనకి సహాయపడతారని ఇంతదాకా తట్టనేలేదు.

"ఏం దొంగిలించావు?"

"డబ్బు నాలుగొందలు. ఒకళ్ళింట్లో ఓ రాత్రి దొంగిలించాను" తనకి ఏ మాత్రం ఇష్టంలేకపోయినా అతను చెప్పాడు.

"ఓ రాత్రంటే ఏ రాత్రి?"

"నెల క్రితం. ఖైదునుంచి పారిపోయి వస్తున్నాను."

"ఓహో."

జైల్లోంచి తప్పించుకున్న ఖైదీ అన్నమాట.

"ఏంవుందా పెట్టెలో?" అడిగాడు ఆ దొంగ.

"శవం?"

మొట్టమొదటిసారిగా నిజంచెప్పాడు సుదర్శన్ ఆ పెట్టెలో ఏంవుందో.

"శవం! నేను నమ్మను," అన్నాడు దొంగనవ్వి.

"ఎందుకు నమ్మవు?"

"హత్యలు చేసేవాళ్ళని చాలామందిని చూసాను నేను

జైళ్ళలో. నీలాగా వుండరు హత్య చేసేవాళ్ళు."

సుదర్శన్ ఆ పెట్టెలో తను చంపిన రామనాథ్ శవం వుందని నమ్మించే ప్రయత్నం చేయడం వృథా అనుకుని వూరుకున్నాడు.

"ఘరానా దొంగలావున్నావు. ఎంత వుందేమిటి లోపల" అడిగాడు అతను.

"చాలావుంది. కావాలంటే నువు తీసుకువెళ్లు ఆ పెట్టెని."

"నిజంగా తీసుకెళ్ళనా?"

"నిజంగానే."

క్షణంసేపు ఆశ్చర్యపోయాడు ఆ దొంగ. తర్వాత ఆలోచించాడు.

లోపల నిజంగా డబ్బు వుండివుండదు తను భ్రమపడినట్లుగా. నిజంగానే శవం వుందేమో? శవమే తప్పకుండా వుండివుంటుంది. లేకపోతే అంత నిర్భయంగా చెప్పడు ఆ పెట్టెని తీసుకువెళ్ళమని. అంతపెద్ద పెట్టెలో శవాన్ని పెట్టచ్చు నిజంగానే.

"శవం వుందని తెలియదు నాకు. డబ్బుందనుకుని ఆశపడ్డాను. ఈ రాత్రి ఇక్కడికి రావడం నా అదృష్టమనుకున్నాను," అన్నాడు అతను.

"ఆ పెట్టెను తీసుకువెళ్లు. నీ అదృష్టం ఇంకా కొనసాగితే నిజంగా డబ్బు దొరకచ్చు లోపల. తీసుకుపో పెట్టెని."

"వద్దు. నే వెళతాను."

జేబులోంచి చిన్న రుమాలతీసి కళ్ళు తుడుచుకో సాగాడు అతను నెమ్మదిగా.

సుదర్శన్‌కి అతనువో ఆశాకిరణంలా కనపడ్డాడు. వదులుకో దలచుకోలేదు అతన్ని. ఉపయోగించుకోవాలనుకున్నాడు.

"ఈ పెట్టెని తీసుకువెళ్ళి ఎక్కడయినా మాయంచెయ్యి. త్రవ్వి పాతిపెట్టు. మరేదైనా చేయి. నాకీ ఉపకారం చేస్తే

నిన్ను వదులుతాను. లేకపోతే పోలీసులకి పట్టిస్తాను తెలుసా?"

పకపకా నవ్వాడు అతను.

"కావుండి. నన్ను పట్టిస్తే నువ్వు దొరుకుతావు ఈ శవంతో. బెదిరించి ఏపని చేయించుకోలేవు ఈ లోకంలో. డబ్బిచ్చి ఏ పనయినా చేయించుకోవచ్చు."

"పోనీ డబ్బు కావాలంటే అలాగే తీసుకో. ఎంత కావాలి?"

కొంచెంసేపు ఆలోచించి అన్నాడు.

"నిజంగా తీసుకెళ్ళనా?"

"నిజంగానే."

"వంద రూపాయ లవుతుంది."

"వంద రూపాయలే?"

"అవును. అంతకు తక్కువ కుదరదు."

"ఏంచేస్తావ్ వంద రూపాయలు?"

"ముందు ఈ పెట్టెని బుక్ చేస్తాను ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో దేంట్లోనైనా ప్రక్క వూరికి. రైల్లో వెళ్ళి అక్కడ విడిపించి ఓ స్నేహితుడికిస్తాను."

"అతనేం చేస్తాడు?"

"కాలవల్లో శవాల్ని ముంచటంలో ప్రసిద్ధుడు" నవ్వాడు.

"ఇంత డబ్బు ఖర్చు పెట్టుకుని ఇలా చేసేబదులు నేను మరో ఉపాయం చెప్తాను..."

"మీ ఇష్టం వుంటే ఇవ్వండి. లేకపోతే లేదు."

అతను వెళ్ళడానికి కదిలాడు.

"ఆగు. అలాగే. నీ ఇష్టం."

"వెంటనే ఇవ్వండి. దీన్ని తీసుకుని వెళ్ళిపోతాను."

సుదర్శన్ జేబులోంచి డబ్బుతీసి లెక్క పెట్టి ఇచ్చాడు అతనికి, కొద్దిగా అయిష్టంగానే. అతని కోరికమీద సాయం

పట్టాడు పెట్టెని బయటికి. అతను జాగ్రత్తగా ఆ పెట్టెకి అంటిన మట్టి తుడిచాడు, ఏ మాత్రం కనపడకుండా, తను విడిచిన జైలు దుస్తులతో.

“రిక్షాలో వెళ్తాను,” అన్నాడు.

“వెళ్ళు.”

సుదర్శన్ అయిదు నిముషాలలో ఓ రిక్షాతో వచ్చాడు. అతను రిక్షా బేరం ఆడకుండానే ఆ పెట్టెని రిక్షాలోకి ఎక్కించి అడిగాడు, రహస్యంగా.

“ఎవరున్నారు లోపల ఆడా, మగా?”

“మొగ.”

“కత్తా, గొంతునులుమా?”

“విషం.”

“వుంటా మరి.”

రిక్షా కదిలి వెళ్ళిపోయింది. రిక్షా సందు మలుపు తిరగగానే తృప్తిగా నిట్టూర్చాడు సుదర్శన్.

పీడ విరగడయింది.

ఇక జన్మలో ఆ ఎర్ర పెట్టె గురించి తను విచారించక్కర లేదు. అసలు ఏమైంది కూడా తనకే తెలీదు. ఏమయినా అయినా వాడినే పట్టుకుంటారు. వాడి పేరు కూడా అడగటం మర్చిపోయాడు తను హడావిడిలో.

వంద ఖర్చయిందని బాధపడ్డా తనకి పెద్ద తలనొప్పి వదిలిందని తృప్తిగా నిట్టూర్చాడు సుదర్శన్.

తనెవరో వాడికి తెలియదు. తనెక్కడుంటాడో కూడా తెలియదు. కాబట్టి వాడు తనని భయపెట్టి డబ్బు గుంజే అవకాశం కూడా లేదు.

నెమ్మదిగా నడవసాగాడు ఇంటివైపు. ఎంత మంచిదైంది తను టార్చి లైటు కోసం తిరిగి రావడం!

లేకపోతే వాడు ఆ పెట్టె తెరచి చూసి, ఆ శవాన్ని

అలాగే పడేసి వెళ్ళిపోయే వాడు. ఎవరో వకరు చూసి పోలీస్ లకి రిపోర్ట్ ఇస్తారు. పూర్తిగా తెల్లవారగానే ఆ ఎర్ర పెట్టెతో తనని చూసిన అనేకమంది సాక్ష్యం ఇస్తారు.

ఉరితాడు తప్పింది తనకి తను చేసిన పొరపాటువల్ల. పొరపాట్లు చేయడం కూడా ఒక్కొక్కసారి మంచిదే. తెల్లారాక ఆ గోతిని చూసి ఆ ప్లాట్ వాళ్ళు మట్టి దొంగతనంగా త్రవ్వుకునిపోయి వుంటారని భావిస్తారు.

చేతిలోని టార్చి లైట్ తో నడుస్తున్నాడు గబగబా. సూర్యకిరణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ఇప్పుడు. వెలుగు లోకమంతా పాకుతోంది.

9

హోటల్ కెళ్ళి భోజనం టిక్కెట్ కొనుక్కుని పేపర్ తిరగేద్దామని సోఫాలో కూర్చున్నాడు సుదర్శన్. హోటల్ వాళ్ళ పేపరు తిరగేస్తూండగా__

"హలో," వినిపించింది సుదర్శన్ కి.

తల ఎత్తి చూసాడు సుదర్శన్.

స్టేషన్ లోని క్లోక్ రూంలో వుండే అతను.

"హలో."

మొహమాటానికి నవ్వాడు.

"ఇవాళ కూడా ఆఫీస్ కి వెళ్ళలేదా మీరు?" అడిగాడు.

"లేదు. మీరు?"

"ఇప్పుడే వస్తున్నాను."

"అయిపోయిందా మీ డ్యూటీ?"

"అయిపోయింది. భోజనం చేసి ఇంటికి వెళదామని వచ్చాను."

"మీ ఆవిడ..."

"పుట్టింటి కెళ్ళింది నాలుగో కానుపుకి."

"నేను కూడా మీలాగే."

అతను లోపలికి వెళ్ళిపొయ్యాక పేపర్ పడేసి, సిగరెట్ అంటించి, ఓ సినిమా పత్రిక కనిపిస్తే అందుకున్నాడు. పేజీలు తిరగేయసాగాడు.

పది నిముషాల తర్వాత లేచాడు భోజనం చేద్దామని.

అతను మళ్ళీ కనిపించాడు, చేతులు తుడుచుకుంటూ, బయటకి వస్తూ. అతన్ని గమనించనట్లుగానే లోపలికి నడిచాడు సుదర్శన్. కాని అతను వదిలి పెట్టలేదు.

"ఏం చేసారు మీ పెట్టె? ఆఫీస్‌లో ఇచ్చేసారా?"

"ఇచ్చేసాను."

సమాధానం చెప్పాడు సుదర్శన్.

"ఇవాళ క్లోక్ రూమ్‌కు ఇంకో ఎర్రపెట్టె వచ్చింది."

"మీకు ఎర్రపెట్టెలు వస్తూంటాయనుకుంటాను రోజూ."

"కాని ఇలాంటివి నెలకోసారి కూడా రావు. ఆ పెట్టె చూడగానే మీరే గుర్తొచ్చారు."

"ఏం?"

"అచ్చు మీరు తెచ్చిన పెట్టెలాంటిదే అదికూడా."

కొద్దిగా ఇంట్రెస్ట్‌గా చూసాడు సుదర్శన్, అతని వంక.

"అలాగా."

"అవును. అదసలు మీ పెట్టేనేమో నన్న అనుమానం కలిగింది నాకు. మీ పెట్టెకి ఓ చోట రంగుపోయింది కొద్దిగా. దీనికీ అక్కడే రంగుపోయింది."

సుదర్శన్ మెదడులో ఏదో అనుమానం మొలకెత్తింది.

"తాళం కూడా అచ్చం నిన్నటి మీ పెట్టె మాదిరేవుంది."

"ఎన్ని గంటలకి వచ్చిందా పెట్టె?"

"తెల్లారాక. ఏడుకనుకుంటాను. నేను డ్యూటీకి ఎక్కిన గంట తర్వాత వచ్చింది ఆ ఎర్రపెట్టె."

"ఓ మొగతను తెచ్చాడు కదూ? కోలమొహం. కాఫీ కలర్ షర్ట్."

"అవును. అతనే. మీ పెట్టె అయితే అది."

"ఆ భగవంతుడా! ఎంత పని చేసాడు," అన్నాడు సుదర్శన్ అప్రయత్నంగా.

"ఏమిటి? ఎవరతను!?" అడిగాడతను.

"మా ఆఫీస్ బాయ్. పెట్టె ఆఫీస్‌లో ఇవ్వరా అని పంపితే తీసుకొచ్చి మీ క్లోక్‌రూంలో పడేసి వుంటాడు," ఆలోచించి చెప్పాడు సుదర్శన్ అబద్ధం.

"ఆశ్చర్యంగా వుందే?"

"పదింటికి ఆఫీస్ తెరిచిప్పుడు తీసుకవెళ్ళ లేదన్న మాట" అన్నాడు సుదర్శన్. ఆలోచిస్తున్నాడు గబగబా ఏం చెయ్యాలా, ఎలా ఆ పెట్టెని మళ్ళీ వెనక్కి తీసుకోవాలా అని.

"మీరు ఫోం చెయ్యండి."

వెళ్ళబోయాడు అతను. సుదర్శన్ అతని చెయ్యి పట్టుకుని ఆపి అన్నాడు భయంగా.

"చూడండి సార్. ఆ పెట్టెలో కొన్ని ముఖ్యమయిన రికార్డ్స్ వున్నాయని చెప్పాకదా. ఇవాళ రెండు గంటలకి మీటింగ్ సమయానికి ఆ పెట్టె అక్కడ ఉండకపోతే నా కొంప మునుగుతుంది. మేనేజర్ నన్ను డిస్‌మిస్ చేస్తాడు వెంటనే."

"ఇంకా టైం వుందిగా. మీ ఆఫీస్‌బాయ్ వచ్చి తీసుకెళ్తాడేమో?"

"నాకు నమ్మకం లేదు. శెలవడిగాడు ఈ రోజు ఉపవాసం వున్నానని. ఇవ్వనన్నాను. అందుకని ఈ పని చేసి వుంటాడు."

"అయినా అది మీ పెట్టె అవునో, కాదో."

"తప్పకుండా మాదే. ఆ పెట్టె తెచ్చిన మనిషి గుర్తులు కూడా చెప్పాగా. అయినా వుండండి ఒక్క క్షణం," అని సుదర్శన్ టెలిఫోన్ వైపు నడిచాడు.

టెలిఫోన్ రిసీవర్ అందుకుని అయిదుసార్లు సున్నాలు తిప్పాడు, ఏదో నంబర్ డయల్ చేస్తున్నట్లుగా. రాంగ్ నంబర్ డయల్ చేస్తే వినిపించే శబ్దం వినిపిస్తోంది రిసీవర్ లోంచి.

అతను వింటూండగా మాట్లాడాడు సుదర్శన్.

"నేనుసార్. సుదర్శన్ ని."

"......"

"ఆ పెట్టె పంపాసార్ మన ఆఫీస్ బాయ్ వెంట..."

"......"

"అనుకున్నాను సార్ చేరివుండదని. పొద్దున శెలవడిగాడు. ఇవ్వనన్నాను. తీరా ఆ పెట్టె..."

"......"

"ఇలా చేస్తాడనుకోలేదు. రైలుస్టేషన్ లో క్లోక్ రూంలో వుంచాడుట. చాలా కాకతాళీయంగా అక్కడ పనిచేసే అతను కనపడితే..."

"......"

"యస్ సార్. తెస్తానుసార్..."

రిసీవర్ మూసి అడిగాడు సుదర్శన్ అతన్ని.

"నేను లగేజ్ రిసీట్ లేకుండా మళ్ళీ దాన్ని అడగడం అన్యాయం. అయినా అడగక తప్పటంలేదు. ఇస్తారా?"

"నాదేంలేదు. ఇప్పుడు డ్యూటీలో వుండి నేనుకాదు. మరొకతను. ఇస్తానంటే ఇప్పిస్తాను."

"ఒన్ సెకండ్" అని రిసీవర్ లో మాట్లాడాడు సుదర్శన్ అమితంగా భయపడిపోతూ.

"చెప్పానుసార్. ప్రయత్నిస్తానన్నారు..."

చివాట్లు తింటున్నట్లుగా మొహంపెట్టాడు సుదర్శన్. కొంచెంసేపాగి అన్నాడు.

"ఐయామ్ ఆఫుల్లీ సారీసర్, డైరెక్టర్ మీటింగ్ కి వస్తు

న్నారని తెలియదు. ఎలాగయినా అది తెస్తాను. ఇలాచేస్తాడనుకోలేదు వాడు."

రిసీవర్ పెట్టేసి, జేబులోంచి రూమాలతీసి, నుదుటమీద పట్టిన చెమట తుడుచుకున్నాడు సుదర్శన్.

జేబురుమాలు జేబులోపడేసి అన్నాడు అతని రెండు చేతులూ పట్టుకుని. "మీ రెలాగయినా నామీద దయవుంచి ఇప్పించాలి ఆ పెట్టెని. ఇంకా చేరలేదు."

"ఫోన్ చేసి చెప్తాను మా కొలీగ్ కి..."

"అలాకాదు. మీరు నా వెంట రావాలి. అంతగా అయితే ఆయనకి చెప్పగలరు మీరయితే. ప్లీజ్. మిమ్మల్ని ఇలా ఇబ్బంది పెట్టడం నాకు బాగాలేదు. అయినా ఈ ఒక్క సారికి మాత్రం దయవుంచాలి మీరు."

నిజంగా ఇబ్బందిగానే చూసాడు అతను.

"లేకపోతే నా వుద్యోగం పోతుంది. డైరెక్టర్ మంచి వాడుకాడు. చాలా బిజీమేన్. టైం వేస్ట్ చేసానని, అశ్రద్ధ వహించాననీ నన్ను సస్పెండ్ చేస్తాడు వెంటనే."

కొద్దిగా జాలివేసింది అతనికి సుదర్శన్ భయంచూస్తే.

"అలాగే. భోజనం చెయ్యండి. ప్రయత్నిద్దాం"అన్నాడు అతను.

"భోజనమా, వల్లకాడా ఇంకా. ముందు ఆ పని చూస్తే కాని నాకు ఇక భోజనం పుట్టదు" అన్నాడు సుదర్శన్ అతన్ని తొందరచేస్తూ.

వీళ్ళ సంభాషణ వింటున్న హోటల్ కాషియర్ అన్నాడు ఇద్దరూ రెండడుగులు వేయగానే.

"టెలిఫోన్ కాల్ చార్జ్ ఇవ్వలేదు మీరు?"

సుదర్శన్ జేబులోంచి మీల్స్ టిక్కెట్ తీసి కాషియర్ కి అందించి, సమాధానంకోసం ఎదురుచూడకుండా బయటికి నడిచాడు.

రిక్షాలో వెళ్ళారు ఇద్దరూ. దారిపొడుగునా సుదర్శన్ తన భయాన్ని వ్యక్తపరుస్తూనే వున్నాడు అతనికి.

వెధవ. వెధవన్నర వెధవ. మోసంచేసాడు తనని. ఊరు తీసుకవెళ్తానని చెప్పి, మాయమాటలుచెప్పి, వంద రూపాయలు గుంజుకుని, క్లోక్‌రూంలో పావలాతో వదిలించు కున్నాడు ఆ ఎర్రపెట్టెని. మళ్ళీవచ్చి దాన్ని తీసుకోడు. తనకి ఖచ్చితంగా తెలుసు తనని మోసంచేసాడు. అబద్ధం చెప్పాడు తనకి.

అదృష్టం తన పక్షాన వుంది కాబట్టి ఇతను కనపడి చెప్పాడు. లేకపోతే? ఉరితాడు ఆహ్వానించేది తనని.

ఏమిటది? ఎందుకిలా అదృష్టం తన పక్షాన వుంటోంది ఇన్నిసార్లు? చివరికి ఏమవుతుంది? ముందర దీన్ని ఎలా వది లించుకోవాలి? అసలు ఇస్తాడో, ఇవ్వడో?

రిక్షా ఆగింది స్టేషన్ ముందు.

సుదర్శన్ రిక్షావాలాకి రూపాయనోటు ఇచ్చి, చిల్లరకు ఆగకుండా అతన్ని లాక్కెళ్ళాడు క్లోక్‌రూమ్ వైపు.

"దయచేసి మీరేదైనా ఏర్పాటు చెయ్యాలి," అన్నాడు ప్రబతిమాలుతున్నట్లుగా.

అతనివెంట లోపలికి వెళ్ళాడు సుదర్శన్.

పెట్టెదగ్గరికి వెళ్ళిచూసాడు. ఆ ఎర్రపెట్టెకి అంటించి వుంది తుమ్మజిగురుతో లగేజ్ రిసీట్ డూప్లికేట్ కార్బన్ కాపీ. మట్టివాసన వస్తోంది కొద్దిగా.

"ఇదే" అన్నాడు సుదర్శన్ అతనితో.

సుదర్శన్ పరిస్థితి వివరించాడు తనకొలీగ్‌కి అతను.

"ఆ ఎర్రపెట్టె తీసుకోడానికి రసీదులేదు. తర్వాత ఇస్తాడు వాళ్ళ ఆఫీస్‌బాయ్ దగ్గర తీసుకుని."

క్లోక్‌రూం ఇన్‌చార్జ్ మౌనంగా వుండిపోయాడు.

"చాలా అర్జెంట్ సార్. ప్లీజ్" ప్రాధేయపూర్వకంగా

అన్నాడు సుదర్శన్ ఇన్‌చార్జితో.

"అవుట్ ఆఫ్ వే అవుతుంది అలా చేయడం,"
అన్నాడు క్లోక్‌రూం ఇన్‌చార్జ్.

"అవుతుంది. అలా కాకపోతే నా ఉద్యోగం వూడు
తుంది."

"సడన్‌గా ఎవరైనా మామీద చెకింగ్‌కివస్తే ఇబ్బంది
పడటమేకాదు. మా ఉద్యోగంకూడా వూడుతుంది,"
అన్నాడు ఇన్‌చార్జ్ నవ్వుతూ.

"ప్లీజ్. ఈ సహాయం జన్మలో మర్చిపోలేను."

సుదర్శన్ స్నేహితుడు బయటకి పిలిచాడు సుదర్శన్‌ని.
రహస్యంగా చెప్పాడు.

"నిన్న నేనుకాబట్టి సరిపోయింది. ఇతనిది మరీ 'వర్క్
టు రూల్' స్వభావం."

నిస్సహాయంగా చూసాడు సుదర్శన్.

"నన్ను తప్పుగా అర్థంచేసుకోకండి. ఓ యాభైవుంటే
ఇవ్వండి. తంటాలుపడతాను అతనితో. అలాంటి రకమే."

మాట్లాడకుండా ఏభైరూపాయలు తీసిచ్చాడు సుదర్శన్
అతనికి. బయటే వుండిపోయాడు సుదర్శన్. ఉత్సాహం
లేదు సుదర్శన్‌కి అతను నిజంగా క్లోక్‌రూం ఇన్‌చార్జ్‌కి ఆ
డబ్బు ఇస్తున్నాడా లేక తనే స్వాహా చేసుకున్నాడా అన్న
విషయం తెలుసుకోడానికి. ఎలాగైనా ఆ పెట్టె రావాలని
ప్రార్థిస్తున్నాడు దేముడిని.

రెండునిముషాల తర్వాత వచ్చాడు అతను.

"మీరు పెట్టె తీసుకోవచ్చు," చెప్పాడు.

అమృతంలా అనిపించాయి సుదర్శన్‌కి ఆ మాటలు.

వెంటనే రిక్షా పిలిపించి ఆ ఎర్రపెట్టెని పోర్టర్ ద్వారా
రిక్షామీదకి ఎక్కించాడు. క్లోక్‌రూం ఇన్‌చార్జ్ అందించిన
కాగితంమీద, అతను చెప్పినట్లుగా రానీ, సంతకం పెట్టాడు.

కింద తన ఎడ్రస్ రాసాడు.

"వెరీ మెనీ థాంక్స్. మీ మేలు మర్చిపోలేను. ఓ రోజు మా యింటికిరండి," అన్నాడు అతనితో.

తలవూపాడు అతను చిరునవ్వుతో

"సారీ. నా మూలంగా మీకు లేటయిపోయింది. రిక్షా మీద వెళ్ళండి."

అతనికి ఓ రిక్షామాట్లాడి, తనే రిక్షావాడికి డబ్బు చెల్లించి పంపాడు సుదర్శన్.

నెమ్మదిగా రామనాథ్ ఇంటికి బయలుదేరాడు రిక్షాలో సుదర్శన్ ఆ ఎర్ర పెట్టెతో మళ్ళీ నీరసంగా.

మనసు కసిగా, కోపంగా, విసుగ్గా, చిరాగ్గా వుంది రామనాథ్ శవాన్ని వదిలించుకోలేనందుకు. తను ఎంత ప్రయత్నించేసినా అంతా ఎదురు తిరుగుతోంది చివరి క్షణంలో, తన ప్రమేయం లేకుండానే.

శక్తి, కాలం, డబ్బు అంతా దీనికోసం వృథా అయిపోతోంది. ఇరవై నాలుగ్గంటలు దీన్నిగురించే ఆలోచన. ఆఫీస్ ఇల్లు ఏమీ గుర్తురావటంలేదు.

రిక్షా ఆగింది రామనాథ్ ఇంటిముందు.

తలుపు తెరిచాడు సుదర్శన్, తాళం తెరిచి. రిక్షావాడికి సాయంచేశాడు ఆ పెట్టెని ఇంట్లో పెట్టడానికి.

డబ్బులిస్తూ అడిగాడు సుదర్శన్, రిక్షావాడిని.

"ఇంత పెట్టెలో ఏంవుందని ఇంకా అడగలేదే!"

"నిన్న నేకదాబాబు కొప్పడ్డారు ఏంవుంటే నాకేమని?" చెప్పాడు రిక్షావాడు వినయంగా.

"నిన్న నువ్వేనా తెచ్చింది ఈ పెట్టెని?"

"అవును బాబు. నా రిక్షాలోనే వచ్చింది."

వెళ్ళిపోయాడు రిక్షావాడు.

తనకి తెలియలేదు కాని గుర్తుపట్టాడు రిక్షావాడు ఆ ఎర్ర పెట్టెని. ఇలా ఎంతమందో గుర్తుంచుకుని వుంటారు ఆ ఎర్ర పెట్టెని తనని కలిపి.

10

కుర్చీలో కూర్చుని, సిగరెట్ వెలిగించి తాగుతూ ఆలోచించసాగాడు సుదర్శన్ ఇకముందు ఏంచేయాలా అని.

ఎర్రపెట్టె వంక చూస్తూ కూర్చున్నాడు.

ఆ ఎర్రపెట్టె తనను వదిలేలా లేదు. దానిని వదిలించుకోవటంలో తను ఇంత ఇబ్బంది పడివల్సి వస్తుందనుకోలేదు.

తనని చాలామంది చూసారు ఆ ఎర్రపెట్టెతో. పోలీసులకి ఆ ఎర్రపెట్టె దొరికితే వాళ్ళలో ఏ ఒక్కరయినా చెప్పచ్చు ఆ ఎర్రపెట్టెతో తనని చూసామని. లేదా వర్ణించి చెప్పచ్చు, తన పేరు మొదలయిన వివరాలు చెప్పలేక పోయినా.

అలా జరగచ్చు. జరగక పోవచ్చు. తను మాత్రం జాగ్రత్త పడటం మంచిది.

ముందర ఆ ఎర్రరంగుని మాయం చేయాలి ఆ శవధవ పెట్టె మీదనుంచి. తర్వాతే ఏంచేసినా.

చెప్పులు తొడుక్కుని బయటకి వచ్చి తాళంవేసి హార్డ్‌వేర్ షాప్స్ వుండే బజారువైపు నడిచాడు సుదర్శన్.

ఆ షాప్‌లో సేండ్ పేపర్ పెద్ద షీట్ కొని, ప్రక్క షాప్‌లో బ్రష్, ఆకుపచ్చ రంగు డబ్బా కొన్నాడు సుదర్శన్.

ఆ డబ్బాతో మళ్ళీ ఇంటివైపు నడిచాడు సుదర్శన్, కొద్దిగా తేలికపడ్డ హృదయంతో.

"అబ్బాయ్. నిన్నే అబ్బాయ్."

ఎవరో పిలుస్తున్నారు సుదర్శన్‌ని.

ఆగి పక్కకి తిరిగిచూసాడు సుదర్శన్.

రామనాథ్ బాబాయ్!

ముఖాన నవ్వు పులుముకున్నాడు సుదర్శన్.

"రామనాథ్ వచ్చాడా?" అడిగాడు ఆయన.

"రాలేదు. వారందాకా రాడని చెప్పానుగా."

"పొద్దున పదిగంటలకు వచ్చాను. తాళంవేసి వుంది. ఇంకా రాలేదనుకున్నాను. రామనాథ్ రాగానే నన్నోసారి కలవమని చెప్తావు?"

"అలాగే."

"రేపు రాత్రి వెళ్ళిపోతున్నాను వూరు."

మౌనంగా వుండిపోయాడు సుధర్శన్.

"చేతిలో ఆ రంగు డబ్బా ఏమిటి? ఎంతకొన్నావ్."

చెప్పాడు సుదర్శన్ ధర.

"మా ఇంటి కిటికీలకి వేద్దామని తీసుకు వెళ్తున్నాను."

ఇక ఆగకుండా, రామనాథ్ బాబాయి దగ్గర శెలవ తీసుకోకుండా, గబగబా నడిచాడు సుదర్శన్, ఆయన ఎక్కడ వుందీ కూడా అడక్కుండా.

తలుపు తాళంతీసి, తను తెచ్చిన సామగ్రినంతా అమర్చాడు.

సేండ్ పేపర్ అందుకుని గబగబా ఆ పేక పెట్టెకున్న ఎర్రరంగుని రుద్దసాగాడు. రెండు నిముషాలు రుద్దాక రెక్కలు నొప్పి పుట్టసాగాయి. ఆపేసాడు సుదర్శన్. రాత్రంతా గొయ్యి తవ్వటంవల్లనే ఇంకా చేతులు రెండు నొప్పిగా వున్నాయి.

రామనాథ్ మరణించి అప్పుడే రెండు రోజులున్నర దాటుతోంది.

అంటే లోపల డికామ్‌పొజిషన్ మొదలయి వుంటుంది. ఇప్పుడు పెట్టె మూత తెరిస్తే భరించలేని వాసన వేస్తుంది. మరో పది గంటలు దాటితే ఆ వాసన బయటికి కూడా

వ్యాపిస్తుంది.

అందరికీ ఆ వాసనతో అనుమానం కలిగే లోపలే ఏదో ఒకటి చెయ్యాలి.

రంపు మారుస్తే ఆరడానికి అరరోజయినా పడుతుంది. ఆరేదాకా దాన్ని బయటికి తీసుకువెళ్ళటం కుదరదు.

సుదర్శన్ ఆ దొంగని తిట్టుకున్నాడు చాలాసేపు.

సరిత మీదకి మళ్ళింది ఆలోచన.

కృతఘ్నురాలు. డిబాచురర్. సంస్కారం, శీలంలేని భార్య. సరితవల్లే కదా తనకి ఇన్ని చిక్కులు. ఏంచేసినా పాపంలేదు అనుకున్నాడు.

సుదర్శన్‌లో ఒక్కసారిగా నిస్సహాయత, దైన్యం, కోపం, బాధ తన్నుకు వచ్చాయి. తనున్న సుడిగుండాన్ని తలచుకుంటే మొదటిసారిగా కళ్ళల్లో నీళ్లు తిరిగాయి, తనున్న స్థితి, పట్టుబడితే పర్యవసానం తలచుకుంటే.

మాటిమాటికీ వురితాడు గుర్తుకొస్తోంది.

తలుపు చప్పుడైంది.

తలుపు చప్పుడు వినిన ఇక నెర్వస్‌నెస్, భయంపోయాయి సుదర్శన్‌లో. నీరసంగా లేచి వెళ్ళి తలుపు తెరిచాడు.

ఇద్దరు నించున్నారు బయట. ఎవరో సుదర్శన్‌కి తెలియదు. ఎప్పుడూ చూడలేదు వాళ్ళని.

"యస్. ఎవరు కావాలి?" అడిగాడు.

"రామనాథ్ లేడా?"

"లేడు. వూరెళ్ళాడు. రాంగానే ఏమైనా చెప్పాలా?"

"ఇవాళ రాత్రి అంతా కలిసి చిన్న ప్రోగ్రాం ఏర్పాటు చేసుకున్నాం. ఉదయం నుంచీ ఫోన్ చేయకపోతే ఏమైందో కనుక్కు వెళ్దామని వచ్చాం."

"ఏం ప్రోగ్రాం? నాతో ఏం చెప్పలేదేం?"

"పేకాట. తర్వాత డ్రింక్స్, ఇవాళ డిసెంబర్ ముప్పై

ఒకటి. ప్రతీ న్యూయిర్ రోజు రాత్రి మాకిది రివాజే.''

సుదర్శన్ కి గుర్తొచ్చింది ఆ రోజు డిసెంబర్ 31 అని. మర్చిపోతున్నాడు వారాలు, తేదీలుకూడా ఈ హడావిడిలో పడి.

''సారీ. లేదు.''

''రాత్రిలోపల తిరిగి వస్తాడా?''

''వారందాకా రాడు.''

''సినిమాకి టిక్కెట్ బుక్ చేసానన్నాడు. మాకు రిజర్వే షన్ చేసిన టిక్కెట్స్ ఇవ్వలేదు. ఎక్కడ పెట్టాడో చూస్తారా?''

''అలాగే.''

రామనాథ్ డ్రాయర్ మీద, అలమారులో, పేంట్ జేబులో వెదికాడు కాని కనపడలేదు సుదర్శన్ కి. ఆ ఎర్ర పెట్టెవంక, రంగు డబ్బావంకా, సేండ్ పేపర్ వంక చూస్తూ నిలబడ్డారు ఇద్దరూ.

''సారీ. దొరకలేదు'' చెప్పాడు సుదర్శన్.

''టేబిల్ మీద పర్సువుంది చూడండి. దాంట్లో ఉండి వుండచ్చు.''

పర్సు తెరచి లోపలవున్న టిక్కెట్స్ అందించాడు సుద ర్శన్ వాళ్ళకి.

వాళ్ళు వెళ్ళిపోయాక లెక్కపెట్టాడు పర్సులో డబ్బు. రూపాయిన్నర చిల్లర మాత్రమేవుంది. ప్చ్! ఏదైనా దొర కచ్చని ఆశపడ్డాడు ఈ కష్టకాలంలో.

ఆ ఎర్రపెట్టెని ఎలా వదిలించుకోవాలో మళ్ళీ ఆలోచిం చడం మొదలు పెట్టాడు. తటుక్కున ఓ ఆలోచన తట్టింది సుదర్శన్ కి.

ఆ దొంగ చెప్పినట్లుగా తనేచేస్తే?

పక్క వూరుకెళ్ళి, ఏ హోటల్ లో నయినా గది తీసుకుని,

ఈ పెట్టెని అందులో వదిలేస్తే? తనెవరో తెలియదుగా.

కాని, పక్క వూరుకి వెళ్ళేలోపల వాసన మొదలు పెడితే?

టాక్సీలో తీసుకు వెళ్ళాలి.

సుదర్శన్ శరీరంలో కొత్త ఉత్సాహం వచ్చింది, ఆ పద్ధతి మంచిదనుకోగానే.

ఓసారి అద్దం ముందుకు వెళ్లి, జుట్టు చెరిపేసుకుని, పాపిడి మార్చాడు.

బయటికి వెళ్ళి టాక్సీ బేరంచేసాడు సుదర్శన్ ఏభై రూపాయలకి. డబ్బు నీళ్ళలా ఖర్చయి పోతూండడంవల్ల బాధగా వుంది సుదర్శన్‌కి.

టాక్సీలో, డిక్కీలో ఆ ఎర్రపెట్టెని పెట్టి బయలుదేరాడు. టాక్సీలో మరో ఇద్దరు మాత్రమే వున్నారు. తక్కువ ప్రయాణీకులు వున్నారని ఎక్కువ వసూలు చేస్తున్నాడు డ్రైవర్.

సిగరెట్ వెలిగించి ఆలోచనలో మునిగిపోయాడు సుదర్శన్. వద్దనుకున్నా ఈ ఆలోచనలు వదలడంలేదు. వెన్నాడుతూనే వున్నాయి. ముందు సీట్లో కూర్చుని ఎదురుగా వున్న రోడ్డువంక చూస్తూ ఆలోచిస్తున్నాడు.

తలచుకుంటే ఎంతో ఆశ్చర్యంగా వుంది సుదర్శన్‌కి. ఎందుకిలా అవుతోంది? తన కాయశక్తులా ప్రయత్నిస్తూంటే ఎందుకిలా అవుతోంది? ఆ ఎర్రపెట్టె తనని వెదుక్కుంటూ ఎందుకలా తిరిగి తనవద్దకే వస్తోంది? ఏదయినా మాయవుందా దాంట్లో?

మాయలు, మంత్రాలంటే తనకి నమ్మకంలేదు. ఎవరు మాయ పెడతారు? రామనాథేమీ మాంత్రికుడుకాడు, తన శవం తననిలా ఏడిపించేలా చేయడానికి. తలచుకుంటే అంతా అద్భుతంలా వుంది.

ఏన్ ఏక్ట్ ఆఫ్ ప్యూర్ మిరకిల్. అంతే అయుండాలి.

ఆ టాక్సీలో ప్రయాణంచేసే ఇద్దరి వంకా పరీక్షగా చూసాడు సుదర్శన్. గంభీరంగా, సీరియస్‌గా కూర్చున్నారు ఇద్దరూ. వాళ్ళ మొహాలు కూడా నేరస్థుల మొహాల్లా అనిపించాయి సుదర్శన్‌కి.

నవ్వొచ్చింది తన ఆలోచనకి. నేరస్థుడి కళ్ళకి అందరూ నేరస్థుల లాగానే కనబడతారు. కళ్ళు మూసుకున్నాడు. కాదు; రెప్పలు వాటంతట అవే వాలిపోయాయి మీద ఏదో బరువు వుంచినట్లుగా. చిన్న కునుకు పట్టింది సుదర్శన్‌కి.

టాక్సీ ఒక్క కుదుపుతో ఆగేసరికి మెలకువ వచ్చింది సుదర్శన్‌కి. కళ్ళు తెరవగానే, ఎదురుగా గ్లాస్‌లోంచి కన పడిన దృశ్యం...

రోడ్ బ్లాక్!

రోడ్డుకి అడ్డంగా రెండు జీప్స్ ఆగివున్నాయి. నలుగురు రోడ్డు ప్రక్కన నిలబడి వున్నారు.

నిద్రమత్తంతా ఎగిరిపోయింది వక్కసారిగా.

గుండె కొట్టుకునే వేగం పెరిగింది అప్రయత్నంగా. మళ్ళీ అపాయం. ఈసారి బహుశ తను తప్పించుకోలేడు.

“ఏమిటి?” అడిగాడు ఖంగారుగా డ్రైవర్‌ని.

“ఏమో! అడగాలి” అని డ్రైవర్ అంటూండగానే ఇద్దరు టాక్సీ దగ్గరకి నడిచివచ్చారు. వాళ్ళు ఖాకీ యూనిఫాంలో వున్నారు పోలీసులుకారు. కొంచెం కుదుటపడ్డాడు సుదర్శన్.

“ఎక్కడిదాకా? ఎవరు మీరు?” అడిగాడు ఒకతను లోపలికి చూస్తూ అందరినీ ఉద్దేశించి.

తనతోటి ప్రయాణీకు లిద్దరూ దిగారు టాక్సీ తలుపు తెరచుకుని.

“ఎవరు మీరు?” అడిగాడు సుదర్శన్ కూడా దిగుతూ.

“సెంట్రల్ ఎక్సైజ్ శాఖ. ఈ దారిలో ఎక్సైజ్

సుంకం కట్టని ఎలక్ట్రికల్ గూడ్స్ వెళ్తాయని సమాచారం అందింది మాకు. మీ సామాను తణిఖీ చెయ్యాలి."

డ్రైవర్ కూడా దిగాడు టాక్సీలోంచి తలుపు తెరచుకుని.

సుదర్శన్‌కి అర్థం అయింది ఆ ఎర్రపెట్టె తెరవకుండా వాళ్లు తనని వదలరని. తను పట్టుపడతాడు తప్పకుండా. తన పని ఖాళీ. ఈ ఆట పూర్తయింది. వురితాడు కనిపించింది సుదర్శన్‌కి ఆ అధికారి కళ్ళలో.

"త్వరగా తెమల్చండి. వెనకాల మళ్ళీ బళ్లు వస్తాయి" అన్నాడు.

తన కన్నా మిన్నగా భయపడుతున్నారు మిగతా ఇద్దరు ప్రయాణీకులు.

సుదర్శన్ ఎండిపోయిన నోరుతో అన్నాడు.

"నా పేరు సుదర్శన్. నా పెట్టెలో ఆఫీస్ ఓల్డ్ రికార్డ్స్ వున్నాయి. నేను వ్యాపారస్తుణ్ణి కాదు."

సుదర్శన్ బెదురు గమనించి అన్నాడు వాళ్లలో ఒకడు.

"చూపించండి. మీరు చెప్పేదాంట్లో నిజముంటే వెంటనే వెళ్ళొచ్చు. మీకు ఆలస్యం వుండదు" డిక్కీ తెరిచాడు అతను.

ఆ ఇద్దరి ప్రయాణీకులలో ఒకడు అన్నాడు ఆ అధికారితో.

"ఓసారి ఇలా వస్తారా?"

"దేనికి!"

"ప్లీజ్."

ఆ అధికారిని పక్కకి తీసుకెళ్ళాడు విడిగా.

సుదర్శన్ వాళ్ళవంకే చూస్తున్నాడు. అతను ఆ అధికారితో ఏదో మాట్లాడుతున్నాడు రహస్యంగా గొంతు తగ్గించి గబగబా. ఆ అధికారి ఆసక్తిగా వింటున్నాడు చిరునవ్వుతో.

నిజంగా నేరస్థుడి లక్షణం కనిపించింది అతనిలో సుదర్శన్‌కి.

ఆ అధికారి ఏదో చెప్పాడు ఆ ప్రయాణికుడితో. రెండు నిముషాలు మాట్లాడుతూండి పోయారు ఇద్దరూ ఏదో.

సుదర్శన్ చూస్తూండగానే పది రూపాయల కట్ట చేతులు మారింది! ఆ ప్రయాణీకుడు ఆ అధికారికి డబ్బు ఇచ్చాడు!!

ఆ అధికారి దాన్ని జేబులో వేసుకుని జీప్ వైపు నడిచాడు. తన మనుషులతో ఏదో చెప్పాడు అతను.

"టాక్సీ వెనక్కి తిప్పి పోనియ్యి" అన్నాడు ఆ ప్రయాణీకుడు డ్రైవర్ దగ్గరికి వచ్చి.

"వెనక్కా?" ఆశ్చర్యంగా అడిగాడు డ్రైవర్. అతనికి పూర్తిగా అర్థం కాలేదు జరిగినదేమీ. విచిత్రంగా వుంది. అంతవరకు ఎప్పుడూ ఇలాంటి సంఘటన జరగలేదు అతని సర్వీస్‌లో.

"అవును వెనక్కే."

"అదేం?"

"ఇక్కడ వదిలించుకోడానికే వచ్చాను. ఇంకా పైన మరో జేచ్ వుందిట. ఇక్కడ చెక్ చేసి కూడా పట్టుకోలేక పోతే ఆ జేచ్ దగ్గర పట్టుబడచ్చని ఇలా రెండు జేచెస్ ఏర్పాటు చేశారుట."

సుదర్శన్ వింటుండిపోయాడు అవాక్కయి.

"అక్కడ పట్టుకుంటే శ్రీకృష్ణ జన్మస్థానానికే వెళ్ళాలి సరాసరి. వాళ్ళకికూడా మాట వస్తుంది పైగా."

"మీ ఇష్టం. డబ్బు మాత్రం వాపసివ్వను."

"వెయ్యి వదిలింది. నీ కిచ్చిన వందో లెఖా? పద. పద."

అంతా టాక్సీలో కూర్చున్నారు. డ్రయివర్ టాక్సీ వెనక్కి తిప్పాడు కొంచెం హుషారుగా. డబ్బు మిగులుతుంది పెట్రోల్, శ్రమ వృథా కాకుండా.

ఆ ఇద్దరు ప్రయాణీకులు మౌనంగా కూర్చునున్నారు ఏం జరగనట్లుగానే.

టాక్సీ శరవేగంగా పోతోంది వెనక్కి మళ్ళీ.

సుదర్శన్ బుర్రలో అప్పుడే ఆలోచన మొలకెత్తింది తర్వాత ఏం చెయ్యాలా అని, అప్రయత్నంగానే.

11

సుదర్శన్‌కి మతిపోయినట్లుగా అయింది. రోడ్డుమీద పిచ్చిగా తిరుగుతూ ఆలోచిస్తున్నాడు. మనసులో ఒకటే ఆలోచన. ఒకటే ప్రశ్న.

ఎలా ఆ ఎర్రపెట్టెని వదిలించుకోవటం.

రామనాథ్ శవం ఇలా బూమ రాంగ్ (విసిరిన ఆయుధం తిరిగి విసిరిన వాడి మీదకే రావడం)లా తన దగ్గరకే వచ్చేస్తుందే? ఎందుకిలా అవుతోంది? తన ప్రయత్నాలు ఎందుకు ఫలించడం లేదు?

చేత్తో ఓసారి గడ్డం నిమురుకున్నాడు. నిజంగా పిచ్చాడి లాగేనే వున్నాడు. ఇందాక తన స్నేహితుడు కనపడి పల కరించి అడిగాడు జ్వరం వచ్చిందానని. ముఖంలో కళ, కాంతి లేవు. పెరిగిన గడ్డం, తలకి నూనెరాసి మూడురోజు లవుతోంది.

సుదర్శన్ కళ్లు ఒకచోట 'టు-లెట్' అని రాసివున్న బోర్డుమీద పడ్డాయి. తక్షణ ఓ ఆలోచన మెరిసింది మెదడులో.

తన ఆలోచన ఎంతదాక సబబయినదో ఆలోచించాడు కాసేపు. తర్వాత గబగబా నడిచాడు ఆ ఇంట్లోకి.

ఇంటాయన ఇంటిముందున్న ఖాళీస్థలంలో మొక్కలకి నీళ్ళు పోస్తున్నాడు రబ్బరుగొట్టంద్వారా. పూల మొక్కల దగ్గిర ఆగి వాటి కుదుళ్ళలోకి నీళ్ళు పోయేలా ఏర్పాటు

చేస్తున్నాడు శ్రద్ధగా.

ఏం కావాలన్నట్లుగా చూసాడు సుదర్శన్ వంక.

"ఇళ్ళేమన్నా అద్దెకున్నాయా? టు-లెట్ బోర్డ్ చూసి వచ్చాను," చెప్పాడు సుదర్శన్.

"వుంది. డెభ్భైరూపాయలు. మీకేనా!" అడిగాడు అతను పంపుదగ్గిరకి నడుస్తూ.

తలవూపాడు సుదర్శన్.

పంపు తిప్పి అన్నాడు అతను సుదర్శన్‌తో.

"రండి. చూపిస్తాను."

సుదర్శన్ అతన్ని అనుసరించాడు. ఇంటి వెనకాల మరో చిన్నఇల్లు వుంది, అవుట్ హౌస్ లాగా. తాళం లేదు. గొళ్ళెం పెట్టివుంది బయట. గొళ్ళెం తీసి లోపలకి వెళ్ళాడు అతను. సుదర్శన్ వెనకే నడిచాడు.

రెండు గదులు. ఓ చిన్న వంట గది. వంటగదిలో పంపు. పెంకుటిల్లే అయినా నీట్‌గా వుంది. కింద నాపరాళ్ళు పరిచి వున్నాయి.

"నాకు నచ్చింది" అన్నాడు సుదర్శన్ వెంటనే.

"నచ్చితే రెండు నెలల ఎడ్వాన్స్ ఇవ్వండి. వీలయినంత త్వరలో ప్రవేశించండి" అన్నాడు అతను బయటకి వచ్చాక, గొళ్ళెం పెడుతూ.

"రెండు నెలలది ఇవ్వలేనుకాని ఒక్క నెలది మాత్రం ఇస్తాను," చెప్పాడు సుదర్శన్.

"ఆల్ రైట్. కాని వచ్చే నెలమాత్రం రెండు నెలలది కలిపి ఇవ్వాలి."

"తప్పకుండా. పోతే మరో చిన్న సంగతి."

"ఏమిటి?"

"నా సామాను అట్టే లేదు. అంతాకలిపి ఓ పెట్టెలో తెచ్చుకుంటాను. మా ఆవిడ ప్రస్తుతం పుట్టింట్లో వుంది.

ఒక నెల రోజుల్లో వస్తుంది. అంతదాకా నేను ఇల్లు తాళం వేసి వుంచుతాను. నెల తర్వాత ప్రవేశిస్తాము.''

''మీ ఇష్టం. అలాగే కానివ్వండి.''

సుదర్శన్ జేబులోంచి డెభ్భై రూపాయలు లెక్కపెట్టి తీసి అందించాడు ఇంటాయనకి.

''పూల మొక్కలంటే నాకు ప్రాణం. ఎంతో శ్రద్ధగా పెంచుతున్నాను. వాటినుంచి పూలు కోసినా, ఏం కోసినా మాత్రం, మీరు ఖాళీ చేయాల్సి వస్తుంది.''

''అలాగే.'' అన్నాడు సుదర్శన్ చిరునవ్వు నవ్వి.

''రాత్రి పదిన్నరకి మెయిన్ ఆపేస్తాను.''

''చిత్తం. ఇబ్బంది లేదు లెండి, కొత్తగా పెళ్ళయింది మాకు. మరీ మంచిది అలా అయితే.''

సుదర్శన్ హుషారుగా బయటకి నడిచాడు.

అరగంటలో చేరుకున్నాడు రామనాథ్ ఇల్లు. ప్రక్క పోర్షన్‌లో వాళ్ళు పలకరించారు సుదర్శన్‌ని.

ముభావంగా లోపలకి వెళ్ళిపోయాడు సుదర్శన్ తలుపు తాళం తెరచి. తలుపు మూసాక సుదర్శన్‌కి ఆ గదిలో ఏదో కొత్తగా అనిపించింది.

ఆ ఎర్ర పెట్టెవంక చూసాడు. ఇందాక టాక్సీలోంచి దింపిన తర్వాత ఎలా పెట్టినది అలాగే వున్నది కదలకుండా.

వాసన పీల్చాడు గట్టిగా.

చెడువాసన దుర్వాసన.

చటుక్కున బయటకి వచ్చి తలుపు లేసాడు సుదర్శన్. బయటకి ఆ వాసన వేస్తోందేమో చూసాడు గాలి పీల్చి.

బయటకి వేయడం లేదు. లోపల మాత్రమే వేస్తోంది. అంటే ప్రారంభమయిందన్న మాట. గంటలు గడిచినకొద్దీ ఆ దుర్వాసన అధికం అయి, అందరినీ ఆకర్షిస్తుంది. తను భయపడుతున్నంతా జరిగింది.

సుదర్శన్ మళ్ళీ లోపలకి వెళ్ళి తలుపు వేసాడు. తలుపు దగ్గరే నిలబడి చూసాడు గదంతా పరీక్షగా.

ఆ వాసన పెట్టెనుంచి వస్తున్నట్లుగా అనిపించలేదు. ఆ ఎర్ర పెట్టె దగ్గరకి వెళ్ళి పరీక్షగా చూసాడు. ఒంగోని పెట్టె మీద ముక్కు వుంచి వాసన చూసాడు. ఏ సంగతీ కనుక్కోలేక పోయాడు సుదర్శన్.

ఆ గదంతా తిరిగి చూసాడు. వాసన ఓ చోటినుంచి వస్తోందని గుర్తించాడు. బీరువా కిందనుంచి వస్తోంది.

చీపురుతో బీరువా కింద వూడిచాడు శుభ్రంగా.

బయటకి వచ్చింది ఆ వాసన వేసేది.

ఎలుక.

చచ్చిపోయింది ఓ ఎలుక. ఆ ఎలుకనుంచే ఆ వాసన.

సుదర్శన్ వంటగదిలోంచి దొడ్లోకి వెళ్ళి పార, గునపం తీసుకుని లోపలకి వచ్చాడు: మరో పెట్టె తీసుకుని అందులోని బట్టలన్నీ కుమ్మరించి, ఆ పెట్టెలో పార, గునపం వుంచాడు పాత గుడ్డలతో చుట్టి.

రిక్షా పిలుచుకు వచ్చాడు బయటకి వచ్చి.

కొన్ని క్షణాల్లో రెండు పెట్టెలు రిక్షాలో వున్నాయి.

"ఆ పెట్టె బరువుగా వుంది. అందులో పుస్తకాలున్నాయి!!"

రిక్షావాడు అడక్కుండానే చెప్పాడు సుదర్శన్.

రామనాథ్ పోర్షన్ తలుపు తాళం వేసి వచ్చి రిక్షాలో కూర్చున్నాడు. ప్రక్క పోర్షన్‌లోని వాళ్ళు చూడటం లేదు. చూస్తే ఆ రెండు పెట్టెలు, ఖాళీ ప్లాస్టిక్ బకెట్, మగ్ ఎక్కడికని అడిగేవాళ్ళే. దారిలో రిక్షా ఆపించి సిమెంట్, తాపీ, ఇసక సంపాదించి, పొట్లాలుగా కట్టి పెట్టెలో పెట్టాడు.

సుదర్శన్ పది నిముషాల్లో చేరుకున్నాడు ఆ ఇంటికి.

ఇంటాయన ఆ పూల మొక్కల పాదుల్లో ఏదో మందు చల్లుతున్నాడు. నవ్వాడు పలకరింపుగా సుదర్శన్ ని చూసి.

సుదర్శన్ నవ్వి, వెనకాల రిక్షా వాడు రాగా, నడిచాడు అవుట్ హౌస్ వైపు. లోపలికి సామానంతా చేరాక వాడికి రెండు రూపాయలిచ్చి పంపాడు సుదర్శన్.

రిక్షా వాడు వెళ్ళగానే సుదర్శన్ ప్లాస్టిక్ బకెట్ నిండా నీళ్లు పట్టి తెచ్చుకున్నాడు.

చీకటి పడగానే చిన్న పెట్టె తెరచి అందులోంచి పార, గునపం తీసాడు, చుట్టిన పాత గుడ్డలు విప్పి.

తలుపులు రెండూ లోపల గడియ వేసాడు, కిటికీ తలుపులతో సహా. క్రింద పరచిన నాపరాళ్ళ వంక చూసాడు పరిశీలనగా. గది మూలగా వున్న ఓ నాప రాయికి చుట్టూ బార్డర్‌లా వున్న సిమెంట్ పెచ్చులు వూడింది కొద్దిగా.

గునపానికి పాత గుడ్డలు చుట్టి నెమ్మదిగా ఆ వూడిన సిమెంట్ పెళ్ళలమీద కొట్టసాగాడు చప్పుడు కాకుండా. అరగంట తర్వాత సుదర్శన్ ఆ నాపరాయి, ప్రక్కనే వున్న మరో మూడు నాపరాళ్ళు తీసాడు.

తవ్వసాగాడు వుత్సాహంగా.

గొయ్యి తవ్వి, ఆ గోతిలో పెట్టెని కప్పెట్టి, పైన మళ్ళీ గచ్చుచేసి, నాపరాళ్ళు పరిచి సిమెంట్ చేస్తే, బ్రహ్మ రుద్రాదులు కూడా కనుక్కోలేరు లోపల శవం వుంటుందని.

ఆ కాస్తంత మేర కొత్తగా సిమెంట్ చేసినట్లు కనబడుతుంది కాని లోపల ఏదైనా వుంచి సిమెంట్ చేసారని ఎవరూ వూహించలేరు. గచ్చుపాడయితే మళ్ళీ బాగుచేసారనుకుంటారు.

నెల రోజుల తర్వాత ఎండి గట్టి పడిపోతుంది. నెల తర్వాత ఇంటాయన తనకోసం ఎదురు చూస్తాడు. రాక

పోతే మరో నెల చూస్తాడు. అప్పటికీ రాడుతను.

వినుగత్తి తాళం బద్దలు కొట్టచ్చు. లోపల అంతా ఖాళీ. మరొకరికి ఇచ్చుకుంటాడు ఇల్లు. ఇక కాలం అలా గడిచిపోతుంది భూస్థాపితం అయిన రామనాథ్ శవంవున్న ఆ ఎర్రపెట్టెతో.

ఒకవేళ ఆ పెట్టె బయటపడ్డా, నెల తర్వాత రామనాథ్ గుర్తుపట్టే విధంగా వుండడు ఆ పెట్టెలో. అస్థిపంజరం మాత్రమే మిగులుతుంది. తను ఎలా వుంటాడో మర్చిపోతాడు ఇంటాయన అప్పటికి. ఆ ఎర్రపెట్టె గురించి మిగతా అంతా కూడా మర్చిపోతారు. దట్ జ్ ది ఎండాఫ్ ది బాస్టర్డ్.

పని పూర్తవగానే గడ్డపలుగు, పార రామనాథ్ ఇంటికి చేర్చాలి, ఆ బక్కెట్, పెట్టెలతో పాటుగా. ఒకసారి ఆ పెంకుటింటికి, ఎవరితోనూ సంబంధం లేకుండా వున్న ఆ అవుట్ హౌస్‌కి, తాళం పడితే ఇక తను క్షేమమే అన్ని విధాలా.

రాత్రి ఏ రెండు గంటలకో బయటపడాలి పని పూర్తి చేసుకుని ఆ మిగిలిన వస్తువులతో. అంతదాకా ఈ బాధలు తప్పవు.

గుడ్ బై టు దికార్ప్స్ ఆఫ్ రామనాథ్ ఎండ్ బై టు ది బ్లడీ రెడ్ ట్రంక్.

12

పెండింగ్ వర్క్ చాలా మిగిలిపోయింది. సుదర్శన్ తన బాస్‌కి అడగక పోయినా సంజాయిషీ చెప్పాలని, రామనాథ్ శవంకోసం తను తగిలేసిన డబ్బుమొత్తం ఎంతయిందో లెక్క చూసుకుని, పని ప్రారంభించాడు. ఎర్రపెట్టెని ఇప్పటి

కైనా వదిలించుకోగలిగినందుకు అతని మనస్సంతా తేలికగా వుంది.

ఫైల్‌లోని అర్జెంట్ లెటర్ చదువుతూంటే చెప్పాడు ప్యూన్ వచ్చి —

"మీకోసం ఓ పోలీస్ కాన్‌స్టబుల్ వచ్చాడు సార్."

"ఎవరు?" తత్తరపడుతూ అడిగాడు సుదర్శన్.

"పోలీస్ కాన్‌స్టేబుల్ బయట వున్నాడు."

మరోసారి గుండెవేగం పెరిగింది సుదర్శన్‌కి. కుర్చీలోంచి లేచి బయటకి నడిచాడు.

"మీరేనా సుదర్శన్?" అడిగాడు యూనిఫాంలో వున్న పోలీస్ కాన్‌స్టబుల్.

"అవును. ఏం?"

అతను బయట ఆగివున్న పోలీస్ వేన్ వంక చూపించి అన్నాడు.

"మా సబ్ ఇన్‌స్పెక్టర్ పిల్చుకు రమ్మన్నారు మిమ్మల్ని."

"దేనికీ!"

"ఏమో? నాకు తెలియదు పదండి."

"చెప్పి వస్తాను."

రెండు నిమిషాల్లో పోలీస్ వేన్‌లో, పది నిముషాల్లో పోలీస్ స్టేషన్‌లో వున్నాడు సుదర్శన్. ఏమయివుంటుందో అంతుపట్టడం లేదు.

"మీరేనా సుదర్శన్?" అడిగాడు సబ్.

"అవును."

"అంటే సరిత భర్త."

"అవును. నన్ను దేనికి పిలిపించారు?"

"ఓ హత్య గురించి."

"హత్య గురించా?"

"అవును. మీ స్నేహితుడి హత్య గురించి."

"నా స్నేహితుడెవరూ హత్యచేయబడలేదే?"

"రామనాథ్."

"రామనాథ్ హత్య చేయబడ్డాడా?"

రెండు గుటకలు వేసి అన్నాడు సుదర్శన్. బహుశ సరిత రిపోర్టిచ్చి వుంటుందనుకున్నాడు. ఆ క్షణంలో సరిత మీద ఎక్కడలేని కోపం ముంచుకొచ్చింది సుదర్శన్‌కు.

"అవును. మీకీ సంగతి తెలుసు మీరేచేసారు కాబట్టి."

"మై గుడ్ హెవెన్స్. ఏమిటి మీరు మాట్లాడేది? రామనాథేమిటి? హత్యచేయబడట మేమిటి? నేను హత్య చేయటం ఏమిటి? సరిత తప్పుగా మిమ్మల్ని పెడత్రోవ బట్టిస్తోంది నామీద కోపంతో."

"సరిత మాకు రిపోర్టిచ్చిందని మీ రెందు కను కున్నారు?"

"...నామీద కోపంతో అలా చేసివుండచ్చని అను కున్నాను. అంతే. సరిత కాదా రిపోర్టిచ్చింది?"

"కాదు."

"మరెవరు?"

"మూడో వ్యక్తి వకరు...మీ తప్పు వప్పుకుంటారా?"

"రామనాథ్ వాళ్ళవూరు వెళ్తానని చెప్పాడు నాకు. వారందాకా తిరిగి రాడని కూడా చెప్పి వెళ్ళాడు."

"ఎప్పుడు?"

"మూడు రోజుల క్రితం."

"అబద్ధం."

"నిజం."

"మిస్టర్ సుదర్శన్ మూడు రోజుల క్రితం మీరు రామనాథ్ ఇంటికి వెళ్ళారు రాత్రి. అక్కడ సరితని చూసి ఆవేశంతో మీరు తెచ్చిన విషం కాఫీలో కలిపి రామనాథ్

చేత ప్రాగించారు. రామ్‌నాథ్ మరణించాడు అక్కడి 'కక్కడే."

"ఇట్సాలై. ఇట్సేదేమ్సలై."

"ఇటీజ్ ట్రూ. తర్వాత మీరు రామనాథ్ శవాన్ని ఎర్రపెట్టెలో పెట్టి, దాన్ని మాయం చేసారు."

"ఇన్‌స్పెక్టర్ ఆపండి."

"నేను సబ్ ఇన్‌స్పెక్టర్‌ని ఇన్‌స్పెక్టర్‌ని కాను. నేను చెప్పిందంతా నిజమని నిరూపించగలను."

"ఎలా?"

"అయితే పక్కగదిలోకి రండి."

సుదర్శన్ పక్కగదిలోకి నడిచాడు సబ్ వెనకే.

"గదిలోకి చూడండి."

సుదర్శన్ గదిలోకి చూసాడు.

గుండె జబ్బుంటే అక్కడి కక్కడే ఆగిపోయివుండేది. ఒంట్లోని రక్తనాళాలన్నీ తెగిపోయినట్లుగా, ఒంట్లోని రక్తమంతా ఒక్కసారిగా ఆవిరయిపోయినట్లుగా అనిపించింది సుదర్శన్‌కి. కళ్లు గిర్రున తిరగసాగాయి.

ఎదురుగా గది మధ్యలో —

ఎర్రపెట్టె!!?

తను స్వయంగా గొయ్యితీసి, తవ్వి, పాతిపెట్టిన ఎర్రపెట్టె వుంది ఎదురుగా, తనని వెక్కిరిస్తూ!

"ఎక్కడిదది?" గొణిగాడు సుదర్శన్.

"మీరు దాచిన చోటునుంచి తెచ్చాము."

"ఎక్కడ దాచాను?"

"ఆ పెట్టె మీదికాదని అనుమానమా? దగ్గరికి వెళ్ళి పరీక్ష చేసి చూడండి."

సుదర్శన్ ఆ పెట్టె దగ్గరికి నడిచి పరీక్షగా చూసాడు.

అదే తాళం. అదే పెట్టె. తను సేండ్ పేపర్‌తో రంగు

పోగొట్టిన చోటు అలాగే వుంది. మట్టి వాసన కూడా వేస్తోంది.

"ఇంపాసిబుల్" గొణిగాడు.

"ఇప్పుడు చెప్పండి."

సుదర్శన్ నోట మాటరాలేదు.

"మార్చురీలో వుంది శవం. విషం ఏదో ఇంకా కనుక్కోలేదు. కాని ఆ విషం తాలూకు బాటిల్ దొరికింది మీ వేలి ముద్రలతో సహా."

జేబులోంచి ఓ చిన్న బాటిల్ తీసి చూపించాడు సుదర్శన్ కి సబ్ ఇన్ స్పెక్టర్. ఆ విషం బాటిల్, వేలిముద్రలు చెడకుండా మరో పెద్దబాటిల్ లో వుంచబడింది.

"అవును" గొణిగాడు సుదర్శన్.

"రండి."

ముందు గదిలోకి వచ్చారు ఇద్దరూ.

"కూర్చోండి."

జావలాకారిపోయ్యాడు సుదర్శన్. నీరసంగా కుర్చీలో కూర్చున్నాడు సుదర్శన్, ముళ్ళమీద కూర్చున్నట్లుగా.

"ఇప్పుడు చెప్పండి జరిగిందంతా జరిగినట్లుగా."

"ఏం చెప్పను?"

కాగితం పేడ్ సుదర్శన్ ముందుకి తోసాడు సబ్ ఇన్ స్పెక్టర్.

"అంతా. ఆ పెట్టెని మీరు ఆ ఇంట్లో ఔట్ హౌస్ లో పాతిపెట్టేదాకా జరిగిందంతా టూకీగా వ్రాయండి" చెప్పాడు.

సుదర్శన్ సంశయంగా చూసాడు.

"వ్రాయండి. తప్పదు" అన్నాడు సబ్ ఇన్ స్పెక్టర్.

టూకీగా వ్రాసాడు సుదర్శన్ అంతా పావుగంటదాకా, వోపికగా. పేడ్ తోసాడు సబ్ ఇన్ స్పెక్టర్ వైపు.

అంతా చదివి అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"రిమార్కబుల్ ఎండ్ స్ట్రేంజ్. ఎన్నిళ్లో ఇన్సిడెన్సెస్?"

"అవును. ఆ ప్రెషర్ వదిలించుకోలేక చచ్చాను."

"మీకా విషం ఎక్కడిది?" అడిగాడు సబ్.

"ఓ మెడికల్ రిప్రజెంటేటివ్‌ని అడిగి తీసుకున్నాను."

"ఎలా సంపాదించారో వివరంగా చెప్పండి!"

"నాకు విషం కావాలని అడిగాను. దేనికని అడిగాడు. ఏదో కుంటిసాకు చెప్పాను. ఇవ్వలేదు. రహస్యంగా వాడి చెస్ట్ తెరచి దొంగిలించాను."

సబ్‌ఇన్‌స్పెక్టర్ జేబులోంచి ఆ విషం బాటిల్ తీసి దాని వంక చూసి అడిగాడు.

"దీన్నే! ఎందుకు తీసుకున్నారు?"

"సంవత్సరం క్రితం ఓ డాక్టర్ ఇది ఇన్‌జెక్షన్ ఇచ్చాడు మా నాన్నకి. అక్కడికక్కడే మరణించాడు. విషమని తెలి సింది అంతా అయాక. ఏదో పొరపాటు జరిగి ఆ మందు ఇచ్చానని చెప్పాడు డాక్టర్."

"అప్పుడు ఆ సీసామీద వున్న పేరు గుర్తుంచుకున్నారా?"

"అవును, సల్ఫాడిమడైన్ దాని పేరు. అదే ఉపయోగించాను రామనాథ్‌కి."

"సంతకం పెట్టండి ఆ సంగతికూడా వ్రాసి."

సుదర్శన్ అలాగే చేసాడు.

"ఆవేశంలో చంపారా? లేక ముందర చంపాలనే వెళ్ళారా?" అడిగాడు సబ్.

"రెండూ."

కొన్ని క్షణాలు ఆ విషం బాటిల్ వంక చూసి అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్.

"బాడ్ లక్."

"అవును. అసలు ఎవరు రిపోర్ట్ చేసారు?" అడిగాడు సుదర్శన్.

కళ్ళముందు పురితాడు కనిపిస్తోంది ఇదివరకటి కన్నా స్పష్టంగా. తను పడిన శ్రమ అంతా వృధా అయింది.

"అడుగో. అతను రిపోర్ట్ చేసాడు."

సుదర్శన్ తల వెనక్కి తిప్పి కొద్ది దూరంలో నిలబడి వున్న అతని వంక చూశాడు.

వెంటనే కెవ్వున అరిచాడు సుదర్శన్. కుర్చీలోంచి లేచాడుగాని నిలబడలేక కూలబడిపోయాడు కుర్చీలో మళ్ళీ. ఆ గదంతా గిర్రున తిరుగుతున్నట్లుగా అనిపించింది.

ఎదురుగా నవ్వుతూ నిలబడివున్నాడు నడుంమీద చేతు లుంచుకుని.

రామనాథ్!!!

"దె..దె...దెయ్యం" అన్నమాటలు వినపడ్డాయి సుదర్శన్ నోట్లోంచి వినబడనట్లుగా.

"దెయ్యంకాదు. నేనే" అన్నాడు రామనాథ్ దగ్గరికి నడిచివస్తూ.

"నువు...నువు చావలేదా?" కుర్చీలోంచి లేచి నుంచుని, పడిపోకుండా బల్లపట్టుకుని అడిగాడు సుదర్శన్, రామనాథ్ ని.

"చావలేదు. భార్యని ఎలా సంతోషపెట్టాలో తెలియదను కున్నాను నీవు ఇంతకాలం. చంపడం కూడా తెలియదని ఇప్పుడు తెలిసింది."

సుదర్శన్ మొహం ఎర్రబడింది.

"ఎలా తప్పించుకున్నావ్?" అడిగాడు.

"మీరు కాఫీలో కలిపింది విషం అని భ్రమ పడ్డారు కాని, విషంకాదది" అన్నాడు సబ్ ఇన్స్పెక్టర్ చిరు నవ్వుతో.

"విషమే. దానివల్ల సంభవించిన ఓ మరణం చూసాను

కళ్ళారా."

"కానేకాదు ముమ్మాటికి...బహుశ మీ నాన్నగారి మరణానికి కారణం లైఫ్ ఎక్స్పైర్డ్ సల్ఫాడిమిడైన్ అయి వుండచ్చు."

"లైఫ్ ఎక్స్పైర్డ్ అంటే!"

"లైఫ్ ఎక్స్పైర్డ్ అంటే, మందు తయారు చేశాక కొంత కాలంలో దాన్ని వుపయోగిస్తేనే గుణమిస్తుంది. ఆ కాలపరిమితి దాటాక గుణం వుండదు. విషంగా పరిణమిస్తుంది చాలాసార్లు."

"కావచ్చు కాని ఇదే మందది" అన్నాడు సుదర్శన్.

"కాఫీతాగాక మీరు దెబ్బలాడారు రామనాథ్తో కొట్టారు. పడిపోయాక చచ్చిపోయాడని భయపడ్డారు. నిజానికి చచ్చిపోలేదు. స్పృహ తప్పింది అంతే."

"మరి నేను స్వయంగా పెట్టెలో పెట్టి తాళం వేసానే!"

"అదే మీరు చేసిన మరో పెద్ద పొరబాటు. పెట్టెలో స్పృహలోలేని రామనాథ్నుంచి రిక్షాకోసం వెళ్ళారు. మీరు వెళ్ళగానే మెలకువ వచ్చింది రామనాథ్కి."

"ఆ తర్వాత నే చెప్తాను. జరిగింది గ్రహించాను నేను. ఈ ఆట ఎంతదాకా ఆడతాడో ఆడనీ చూద్దామని, నా పుస్తకాల షెల్ఫ్ ఖాళీచేసి, అందులోని పుస్తకాలన్నీ మూటకట్టి పెట్టెలో వుంచాను బరువుకి. నేను దాక్కున్నాను. నేను చచ్చాననీ, నా శవం అందులోనే వుందని భ్రమపడ్డావు. ఆ భ్రమతోనే లోపల శవం—అంటే నేను వున్నానా, లేదానని చెక్ చేయకుండా, ఆ పెట్టె తెరచి చూడకుండా తాళం వేసేసి రిక్షాలో తీసుకెళ్ళావు."

ఆశ్చర్యంగా వింటూండి పోయాడు సుదర్శన్.

"ఆ తర్వాత నేను నా పర్స్లో డబ్బు తీసుకుని, ఓ హోటల్లో రూం తీసుకున్నాను. నా స్నేహితుడు ఒకడు

నిన్ను కనిపెడుతూనే వున్నాడు. ఇంతకాలం ఆ పెట్టెతో నువ్వు పడే అవస్థలన్నీ నా దగ్గరకి వచ్చి చెప్పి పగలబడి నవ్వేవాడు రోజూ."

సుదర్శన్‌కి ఏం మాట్లాడాలో పాలుబోక నిలుచున్నాడు.

"ఆఖరిసారిగా ఆ పెట్టెని వదిలించుకున్నావు 'బూమరాంగ్' అవకుండా. సబ్ ఇన్‌స్పెక్టర్ డిసౌజాకి చెప్పాను వచ్చి జరిగిందంతా. అతను ఆ పెట్టె తీసుకువచ్చాడు తవ్వి. తన బలగంతో వెళ్ళి. తర్వాత కథ నీకు తెలిసిందే."

"బిలీవిట్ ఆర్ నాట్ కథలాగా వుంది" అన్నాడు సుదర్శన్ పెగిల్చుకుని.

"మిస్టర్ సుదర్శన్. మీరు ఎన్నుకున్న విధానం చాలా తప్పు. వ్యక్తిగతంగా మీకు ఎవరైనా ద్రోహం చేసినా మీరు దానికి బదులుగా 'హత్య' చెయ్యటం వంటి పెద్ద నేరం చేయడం అమానుషం, అన్యాయం. మరో పద్ధతి ద్వారా మీ కోపాన్ని తీర్చుకోవాల్సింది. సంస్కారం చదువుకున్న మీరే ఇలాచేస్తే ఎలా చెప్పండి? ఆ?"

సుదర్శన్ వంచిన తల ఎత్తలేదు.

"మిష్టర్ రామనాథ్. పెళ్ళయిన ఆడదానితో సంపర్కం మీకు సిగ్గుగా లేదూ? ఇటీజ్ ఎ క్రైం, అడల్టరీ కూడా పెద్ద నేరం."

రామనాథ్ చిరునవ్వుతో అన్నాడు.

"సరిత, నేను చాలా సంవత్సరాలనుంచి ప్రేమించుకుంటున్నాం."

"అలాంటప్పుడు పెళ్ళిచేసుకుని వుండాల్సింది."

"పరిస్థితులు అనుకూలించలేదు."

"అప్పుడు ప్రేమని గొయ్యితీసి పాతాలి."

"అలా చేయలేను. చెయ్యలేదు. ఎందుకంటే నేను డిసౌజాని కాదు. రామనాథ్‌ని కనక."

"మీ మీద అడల్టరీ నేరం ఆరోపించచ్చు."

"దటీజ్ డిఫరెంట్. ఇంక సుదర్శన్ సరితని ఏలుకో డని తెలుసు నాకు. ఇంత దూరం వచ్చాక సరితని అన్యాయం చెయ్యలేను. ఐ విల్ మేరీహార్."

సుదర్శన్, రామనాధ్ కళ్ళలోకి చూసాడు.

"అవును. నేను సరితని పెళ్ళిచేసుకుంటాను."

సుదర్శన్ మారు మాట్లాడకుండా తలవంచుకున్నాడు.

—: అ యి పో యి ం ది :—